
తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

మార్చి -2024

వెల: ₹20



8 కథలు... 75 కార్టూన్లు... 2 సీరియల్స్‌తో
నవ్వుల విందు

వెల కట్టలేని
మీ ఆనందానికి
ఇరవై రూపాయలు
ఓ లెక్కేనంటారా?





# తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం 2024 సందర్భంగా
# కార్టూన్ పోటీలు

డా॥ కె.వి.రమణగారి ఆశీస్సులతో

**శ్రీ తలిశెట్టిరామారావు జయంతి మే,20, తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా**

హాస్యానందం నిర్వహిస్తున్న ఈ కార్టూన్ పోటీలో మన కార్టూనిస్ట్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ...

## తలిశెట్టిరామారావు పురస్కారం-2024

మొదటి బహుమతి-రూ.10,000/- & ప్రశంసా పత్రం

రెండవ బహుమతి-రూ.6,000/- & ప్రశంసా పత్రం

మూడవ బహుమతి-రూ.4,000/- & ప్రశంసా పత్రం

విశిష్ట బహుమతులు- 20

రూ.1,000/- & ప్రశంసా పత్రం

**నిబంధనలు:**

- సబ్జెక్ట్ మీ ఇష్టమే
- అశ్లీల కార్టూన్లు పంపవద్దు.
- ఒకరు 4 కార్టూన్లు మాత్రమే పంపాలి
- కార్టూన్ అటాచ్ చేసేటప్పుడు మీ పేరు, ఫోన్ నెంబరు రాయాలి
- ఫలితాలు హాస్యానందం మే,2024 సంచికలో ప్రచురించబడుతుంది.




ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ శేఖర్ పేరిట నిర్వహిస్తున్న

## శేఖర్ అవార్డు 2024

కార్టూన్ పోటీకి 'విదేశి మోజులు'

అనే అంశంతో

కార్టూన్లు ఆహ్వానిస్తున్నాం!

**10,000 రూపాయలు & ప్రశంసాపత్రం.**

గమనిక:
మీరు పంపే కార్టూన్లు ఏ పోటీకి అనేది స్పష్టంగా రాయాలి!

## బాపురమణ కార్టూన్ పురస్కారం-2024

2023 జనవరి నుండి 2024 జనవరి దాకా ఏ మీడియాలోనైనా మీరు వేసిన కార్టూన్లోంచి మీకు బాగా నచ్చిన కార్టూన్ ఒక్కటంటే ఒక్కటి పంపిస్తే వాటిల్లో ఒక దానికి బాపు రమణ పురస్కారం ఇస్తూ సన్మానించాలని నిర్ణయించాం!

**8,000 రూపాయలు & ప్రశంసాపత్రం.**




## బ్నిమ్మానంద పురస్కారం- 2024

కార్టూనిస్టులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రముఖ కవి,రచయిత,కార్టూనిస్టు కళారత్న శ్రీబ్నింగారు ఒక కార్టూన్ పోటీని నిర్వహిస్తున్నారు.

2000 చొప్పున మూడు బహుమతులు...

ఇంకా ప్రశంసా పత్రం!

**6,000 రూపాయలు & ప్రశంసా పత్రాలు**

**కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరి తేదీ**

**1, ఏప్రియల్, 2024**

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను-

**hasyanandampoteelu@gmail.com**

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక
జీ'వనం'లో నవ్వు నవ వసంతం

హాస్యానందం

మార్చి-2024
21వ సంవత్సరం
237 వ సంచిక

ముఖచిత్రం: సంయుక్త మీనన్
కార్టూన్: శేఖర్

Publisher& Editor-
Ramu.P

Full Pillar : Bnim
Cartoon Feature Editor: Bachi

Creative Team
Dr. K.Ramakrishna
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar, Gandhi, Nagisetty,
GopalKrishna, Bomman
Sangram, Krishna

D.T.P: P. Ramalakshmi,
9440304993

Digital Media Director:
Surya

Well Wishers:
Dr.K.V.Ramanachary, (I.A.S.Retd)
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

Prize Sponsers
K.V.V.Satyanarayana,
Cartonist JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
NCCF

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

జీవిత చందా-
రూ.5000/-లు

email:
hasyanandam.mag@gmail.com
web:
www. hasyanandam.com

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
Ph : **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.



**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...


యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి
**కొంగుచాటు కృష్ణుడు** సీరియల్ ప్రారంభం! **10**

సాంస్కృతిక సౌజన్యమూర్తి
**డా॥ కె.వి.రమణగారి 72వ జన్మదిన వేడుకలు** **18**

**కథలు**

| | | |
|---|---|---|
| వింటావా నా బాధ! | – కె.వి. సుమలత | -20 |
| ఆవకాయ నిద్ర | -అవేరా. | -24 |
| తెలుగుకి తెగులు | -నారంశెట్టి ఉమామహేశ్వరరావు | -28 |
| వామ్మో...ఓరి నాయనోయ్ | -నల్లబాటి రాఘవేంద్రరావు | -36 |
| ఎందుకలాగా?! | -'అభిమన్యు' | -39 |
| వింత సమస్యలు | -పద్మ పైడిమర్రి | -42 |

**శీర్షికలు**

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -7 |
| వాక్చిత్రం | -సుధామ | -8 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -16 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -22 |
| స్మైల్ స్టార్స్ | -కృష్ణ | -26 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -40 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |

**ప్రత్యేకాలు**

| | | |
|---|---|---|
| టీవీఫన్ | -సుభాని | -15 |
| డాక్టర్ డింగిరి | -దయాకర్ | -41 |
| హోళీ-రంగుల నవ్వులు | -చక్రవర్తి | -44 |
| పుస్తక ప్రదర్శనలో హాస్యానందాలు | -దాస్ | -45 |

**సీరియల్**

| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కండ్లకుంట శరత్‌చంద్ర | -46 |




## కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -12 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -13 |
| డబుల్ ధమాకా | -లేపాక్షి | -21 |
| కోర్టూన్లు | -బాచి | -23 |
| హాస్యబ్రహ్మలు | -అంతోటి ప్రభాకర్ | -25 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -29 |
| చిలిపి చిలుకలు | -మురళీధర్ | -33 |
| నెలనెలా వెన్నెల | | -34 |
| భలేబాస్ | -బొమ్మన్ | -38 |
| క.కా.క.క | -బాచి | -49 |


పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి
స్మారక ఉగాది కొసమెరుపు
మినీ హాస్య కథల పోటీ ఫలితాలు...
ఇంకా
NCCF విశాఖపట్నం వారు
నిర్వహించిన కార్టూన్ల పోటీ ఫలితాలు
**వచ్చే సంచికలో...**
బహుమతి ప్రదానోత్సవం
విజయవాడలో
ఏప్రిల్ 14న జరుగును.
సభ వివరాలు కూడా ఏప్రిల్
సంచికలో తెలియజేయబడతాయి!

## ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- రామకృష్ణ
- సుభాని
- మురళీధర్
- లేపాక్షి
- గాంధీ
- బాచి
- దయాకర్
- బొమ్మన్
- దాస్
- ఆదినారాయణ
- మాంటక్రిస్టో
- వర్మ
- శంబంగి
- భాను
- సునీల్
- నాగిశెట్టి
- రామ్‌శేషు
- శర్మ
- కృష్ణ
- అరుణ్
- శేఖర్
- కామేష్
- చక్రవర్తి
- తోపల్లి ఆనంద్
- దొరశ్రీ
- టి.ఆర్.బాబు
- జాకీర్
- బీవీఎస్
- సురేష్
- సురేంద్ర
- టి.భాస్కర్
- సుందరం
- గుత్తుల శ్రీనివాసరావు
- షేక్ సుభాని
- క్రిప్
- శ్రీధర్
- మణి
- రంగాచారి
- ఓంకార్
- సి.ఆర్.రాజు
- రవిశంకర్
- కాశ్యప్



## హాయ్... హాసానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**ఆనందం** ఎవరికి వద్దు?!... ఆనందం కోసం ఒకొక్కరిది ఒకొక్క మార్గం... కొంతమందికి తమకిష్టమైన 'పనులే' జీవనాధరమైనప్పుడు ఆ 'ఆనందమే' వేరు. అలాగే కొంతమంది తమ ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలని చిన్న చిన్న సమావేశాలు ఏర్పాటు చేయటం మనం చూస్తూనే ఉన్నాం. కుటుంబాల్లో అయితే బంధువులతో, వ్యక్తిగతంగా అయితే స్నేహితులతో కలిసి తమ ఆనందాల్ని పంచుకుంటారు. ఇంతవరకు బాగానే ఉంది. మరి మన 'ఈ' ఆనందాలు పంచుకోవటానికి వచ్చిన వాళ్ళ సంగతేంటి?...వాళ్ళూ మనతో మన ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారా? ఇక్కడే మొదలవుతుంది అసలు సమస్య!

పిలిచేంత వరకు బాగానే ఉన్నా... అక్కడికి చేరుకున్న తరువాత విఐపిలు అంటూ... స్పెషల్ అతిథిలంటూ కొంతమందికే మనం ఇచ్చే ప్రాధాన్యత ఇతరులకు చాలా ఇబ్బంది పెట్టడమే కాకుండా ఆనందం పొందడం తరువాత మాట, బాధ మాత్రం మిగులుతుంది.

మన కోసం వచ్చిన వాళ్లంతా విఐపిలే! మనం పిలిస్తేనే 'వీళ్ళూ' వచ్చారు. ఇక్కడ ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ కాదు. పిలిచి మర్యాద చేయలేకపోవచ్చు కానీ అక్కడ ఉండే ప్రముఖులను మాత్రమే పట్టించుకుని మిగతావాళ్ళని 'లెక్క' చేయకపోవటం పెద్ద తప్పే! ఆ ప్రముఖులు పది నిముషాలు ఉండి వెళ్ళిపోతారు... 'ఈ' మిగతా వాళ్ళు మనతో 'చివరి' దాక ఉంటారనే సత్యం గ్రహించాలి. వీళ్ళే 'నిజంగా' మన ఆనందాన్ని పంచుకుంటారనేది కూడా సత్యం!

ఇక సభల్లో కూడా వచ్చిన వాళ్ళందరూ ముఖ్య అతిథులే! వేదికమీద ఎంతమంది ప్రముఖులు ఉన్నా... సభలో ఉన్న అందరివల్లే సభ విజయవంతమౌతుంది. అలా అని 'ముఖ్యుల్ని' గౌరవించ వద్దని కాదు... 'వాళ్ళూ' మన కోసమే వచ్చారు. పైగా మనకుండే కొద్దిపాటి పరిచయంతో వస్తారు. కాబట్టి వారిని తగువిధంగా గౌరవించి, ప్రాముఖ్యం ఇవ్వాల్సిందే!... మనం ఈ రెండింటినీ సమన్వయం చేసుకుని సభలో అయినా, ఇంట్లో అయినా 'సంబరం' చేసుకుంటే, మనం ఆనందం పొందటమే కాకుండా... మన మాట మన్నించి వచ్చిన వారూ కూడా ఆనందంగా పొందుతారు. మరోసారి మన 'పిలుపు'కి ప్రాముఖ్యమిస్తారు. కాబట్టి వచ్చిన 'అందరినీ' గౌరవించటం అనే సూత్రం పాటించాలి. కొంతమందిని 'ఎక్కువ'గా చూసినా, మిగతావారిని మాత్రం తక్కువగా చూడకూడదు. ఆనందం ఎవరికి వద్దు చెప్పండి!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని

కోరుకుంటూ.....

✦ యన్.మాధవీలత,బెంగళూరు

ఫిబ్రవరి హాస్యానందంలో యండమూరి, యర్రంశెట్టి సాయి కలిసి రాసిన 'కొంగుచాటు కృష్ణుడు' సీరియల్ ప్రారంభం అదిరింది. పాత నవలని మా తరానికి ఇలా పరిచయం చేయడం ఎంతైనా అభినంద నీయం. మరోసారి మీకు అభినందనలు.

✦ పి.వి.మధు నివ్రితి, సికింద్రాబాద్

ముఖచిత్రం నవ్వు...ముఖానికి ఆభరణం అని చక్కగా సెలవిచ్చారు. హాయ్... సానందంగాలో ప్రయాణంలో జాగ్రత్తలు గురించి క్లుప్తముగా వివరించారు. మనకే కాదు ఇతరులకు కూడా ప్రమాదం అని గుర్తిం చాలి. ఈసారి అన్ని కార్టూన్లు బాగున్నాయి. సుభాని గారి–'సినిమా సిత్రాలు', చక్రవర్తి గారి–'లవ్ లెటర్ స్కాన్ చేసి చూడు', ఇంజనీర్ వుడ్‌పెకెర్‌తో పక్షులు ఇల్లు కట్టించే జోక్ మురళీధర్ గారిది, నందు గారి అన్ని జోకులు, నాకు క్యాన్సర్ కాదు... కర్కాటక రాశి, పావని గారి కార్టూన్, 'మాట తెచ్చిన తంట (దయాకర్) జోకా? నిజమా? అనిపించింది.




✦ ఎస్.రవీంద్ర, ఖమ్మం

సుధామగారి 'ముక్కు' వ్యాసం ముక్కున వేలేసు కునేలా చేసింది. ఎంత బాగా రాసారు! నిత్యం మనతో ఉండే... మనం చూసుకునే ముక్కుకే ఇంత కథ ఉందా అనిపించింది. ఈ సంచికలో ప్రచురించిన మురళీ ధర్‌గారి 'చిలిపి చిలుకలు' మనోభావాలు వావ్! మూగ జీవులకు మాటొస్తే ఇలానే ఉంటుందేమో అనిపించేలా కార్టూను వేసారు. మురళీధర్‌గారికి అభినందనలు. ఈ రోజుల్లో ప్రేమలు ఎలా మారిపోతున్నాయో కార్టూ న్లతో కళ్ళకు కట్టినట్లు చూపిన మా కార్టూనిస్టులకు అభినందనలు. మొత్తమ్మీద ఇంతమంచి సంచిక అందించిన మా రాముగారికి కృతజ్ఞతలు.




✦ సిహెచ్. కమలాకుమారి, హైదరాబాద్

హాస్యానందంలో కార్టూన్ల పోటీలు, కథలపోటీలు చూస్తుంటే ముచ్చటేస్తుంది. నాకు తెలిసి ఇలా ఇన్ని పోటీలు మరే తెలుగు పత్రికల్లో ఉండవేమో! గ్రేట్! ఇక కథలు కార్టూన్లు, శీర్షికలు అన్నీ ఇంటిల్లిపాదీ చదువుకునేలా ఉండి, మాకు మంచి నేస్తమైపోయింది–హాస్యానందం. కొత్తగా మొదలెట్టిన 'కొంగుచాటు కృష్ణుడు' సీరియల్ చాలా బాగుంది. ఒక మంచి పత్రికని వెలువరుస్తున్న మీకు ధన్యవాదాలు.

✦ బిక్కునూరి రాజేశ్వర్, నిర్మల్

ఇంటిల్లిపాదిని నవ్వించే పని పెట్టుకున్న ఏకైక తెలుగు హాస్య పత్రిక హాస్యానందం ఫిబ్రవరి సంచిక నిజంగా మా ఇంటిల్లిపాదినీ ఆకట్టుకుంది. సుధామగారి 'వాక్చిత్రం' కడుపుబ్బ నవ్వించింది. పదా నందం బాగుంటుంది. కొంగుచాటు కృష్ణుడు సీరియల్ అప్పట్లో చది వాను. మళ్ళీ ఇన్నేళ్ళకు సీరియల్‌గా రావటం ఆనందంగా ఉంది. ఇక కార్టూన్లన్నీ చాలా బావున్నాయి.

✦ బి.రత్నకుమారి, యమ్మిగనూరు

ఫిబ్రవరి నెల హాస్యానందంలో సంపాదకీయం ఎంతో అమూల్య మైనది. డ్రైవింగ్‌లో హెల్మెట్, బెల్ట్‌లాంటి తగు జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలనే మూల్యంగా చెల్లించాల్సి వస్తుందని తెలియజేసారు. యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టిసాయిగార్ల 'కొంగుచాటు కృష్ణుడు' సీరియల్ ఈ సంచికకు ప్రత్యేక ఆకర్షణ అని చెప్పచ్చు!

సుధామగారి వాక్చిత్రం 'నాసికోపాఖ్యానం' సరదాగా బాగుంది. అది ఎలాంటి ముక్కో తెలుపుతూ, ముక్కు ముక్కుకీ ఓ 'టాగ్' తగి లించి... అన్ని రకాల ముక్కుల్నీ కలిపి కుప్పగా పోస్తే... జనాలందరూ పరుగెత్తి వెళ్లి తమ ముక్కు ఎలాంటిదో వెతుక్కుని చూసుకునేలా వుంది. వడ్లమన్నాటి గంగాధర్ గారి 'బుర్ర పాడుచేసే కథ' కాదు, 'బ్రెయిన్ వాష్ చేసే కథ' కూడా. ఎన్నో కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల్ని, సంఘర్షణల్ని నవ్విస్తూనే, వివాహం ఎంత గొప్పదో తెలియజేస్తుంది.

డాక్టర్ కప్పగంతు రామకృష్ణ గారి 'తెలుగా మజాకా' చాలా ఉపయోగకరమైనది. దీర్ఘాలు, వత్తులు విషయం లో జాగ్రత్తలు తీసుకోక పోతే అర్థమే మారిపోతుంది.

గాంధీ మనోహర్‌గారి 'నవ్వులాట'లో 'నివురుగప్పిన తప్పు' ఆలోచింప చేసేది. జీవితం నవ్వులాట కాదు. లేని ఆశయాలకి, ఆదర్శాలకి పోయి వెబ్‌సైట్‌లలో వెతికి నిర్ణయం తీసుకుంటే, 'తప్పుపై నివురు గప్పికుని తిరుగుతున్న 'అభిసారిక'లాంటి వాళ్ళు తగిలి కొండ బాబు జీవితంలా అవుతుంది. 'స్మైల్‌స్టార్'లో నందుగారి పరిచయం, వారి కార్టూన్స్ జీవన విశేషాలు తెలుసుకో గలిగాము. వారి కార్టూన్స్, ఒక ప్రక్కన నవ్విస్తూనే, ఎంతో అర్థవంతంగా వుండటం ముదావహం.

వడ్లమన్నాటి గంగాధర్ గారి 'తర్కారావు కథలు'లో 'ముక్కికి ముక్కి' గా ఇంగ్లీషుని అనువదిస్తే, 'భలే గమ్మత్తే' మరి. హాస్యాన్ని పండిస్తూ ఇంగ్లీషులో వుండే తిరకాసుని చెప్పడం చాలా బాగుంది. పాపం సుబ్బారావుకి తర్కారావు నుండి ఎప్పటికి విముక్తి కలిగేనో... జీతం ఎప్పటికి పెరిగేనో మరి...వేచి చూడాల్సిందే!

పోపూరి విశ్వనాథం గారి 'పదానందం' పాఠకుల బుర్రకి పదును పెడుతుంది. తిరిగి సమాధానం కోసం వచ్చే నెల హాస్యానందం కోసం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేలా చేస్తుంది.

సుభాని గారి 'సినిమాసిత్రాలు'లో తెరవెనుక జరిగే ఎన్నో సిత్రాలు'ని కార్టూన్స్ రూపంలో చక్కగా, హాస్యరూపంలో తెలియజేసారు. దయాకర్ గారి 'మాట తెచ్చే తంటా' అంతా ఇంతా కాదని ద్వంద్వార్థాలని ఎలా సృష్టిస్తుందో, జోకులతూటాలతో పేల్చి చెప్పారు.

హాస్యబ్రహ్మల్లో ఒక బ్రహ్మ అయిన అల్లురామలింగయ్య గారి జీవిత విశేషాలని, హాస్య ప్రయాణాన్ని చక్కగా తెలియజేసారు అంతోటి ప్రభాకర్‌గారు.

# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు
**ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




కార్టూన్ ఇష్టులు
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.





కార్టూనిస్ట్
**శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.



కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.





సరికొత్త సరదా శీర్షిక

# వాక్చిత్రం

సుధామ-9849297958



## నాటీ నైటీ బ్యూటీ డ్యూటీ!

**నైట్ వేసుకునేది కాబట్టి 'నైటీ' అన్నారన్నమాట.**

**'స్వీట్'లెవ్వరూ ఇప్పుడు ఒప్పుకోవడం లేదని ఒకాయన 'ట్వీట్' చేసాడీమధ్య.**

**అసలు నైటీ డ్యూటీ ఏమిటి? అది రాత్రికి 'బ్యూటీ'! కానీ ఇప్పుడు నాటీగానూ 'నాటు'గానూ మారి... దాని 'చోటు' వేళలు విస్తారం అయిపోయి పరిధులు 'దాటు'తున్నాయి.**

భారతీయ స్త్రీ కట్టులో-చీరకున్న గిర ఇప్పుడు ఈ నైటీ వచ్చి పడగొట్టేస్తోందని పెద్దలు వాపోతున్నారు.

అసలు ఆడవాళ్ళ దుస్తుల గురించి మాట్లాడటం, కామెంట్ చేయడం కూడా గొప్ప గొప్ప మంత్రి పదవుల్లో వున్నవారికి సైతం ఇరకాటం తెచ్చే పరిస్థితులు పెరిగిపోతున్నప్పుడు ఈ నైటీ గురించి మాటాడే బులబాటం ఏమిటని మీరు అనుకోవచ్చు.

విషయం ఏదయినా కాయా? పండా?... అని అడిగితే పండా అనే మాటకే 'రాము' అంటే కుదరదు కదా! అంచేత కొన్ని విషయాలు మాట్లాడాల్సిందే!

"నా నైటీ గురించి మాటాడితే 'నై' 'టీ!' అని ఇల్లాలు భేటీ వేసుకున్నా సరే! చెప్పదలిచిందేదో చెప్పాల్సిందే మరి!

రాత్రుళ్ళు పడుకున్నప్పుడు 'కన్వీనియంట్'గా వుండడం కోసం (ఎవరికి అని అడగకండి) అసలు 'నైటీ' ప్రవేశపెట్టబడిందన్నది చారిత్రక సత్యంట! మునుపు నైట్‌డ్రస్‌లు - మగాళ్ళకు చారల పైజామాలు, పైన వదులు చొక్కాలు తెలుగు సినిమాల్లో గొప్పోళ్ళ కుటుంబ దృశ్యాలుగా కనపడేవి... పొడుగాటి వస్త్రం కాళ్ళదాకా కప్పుకున్నట్లుండి నడుం దగ్గర ఓ తాడు ముడివేసుకోవడం (విడిగా కాదులెండి! దానికే వుంటుంది) పెద్ద ఫ్యాషన్! అలాంటివి ధనిక స్త్రీలు కూడా ధరించినట్లుగా బోలెడు దృశ్యాలుండేవి! అవన్నీ ఇంగ్లీష్ సినిమాలనుంచి దిగుమతి అయ్యాయని కొందరి ఉవాచ!

చీర కట్టుకు పడుకుంటే ఇబ్బంది అనీ అసలు నడుం ఒకటీ కనిపిస్తుంది కానీ మిగతా అంతా శరీరం బంధించినట్లుంటుందనీ ఆ కొంగూ అదీ గొంతుకు కూడా చుట్టుకుని ఇబ్బంది పెట్టే వీలుందనీ హాయిగా పడుకోవడానికీ పనులు చేసుకోవడానికీ 'నైటీ' కనిపెట్టబడిందనీ మహిళా సమాజం సంతోషించడం బానే వుంది గానీ... ఇప్పుడు రోజులోనూ దాని వాడకం పెరిగిపోయింది.



అర్థరాత్రి పెళ్ళి ముహూర్తాలయితే ఒకప్పుడు పట్టుచీరలతో కళకళలాడే కళ్యాణ మండపాలు ఆ ముహూర్త వేళకు ముందు మాత్రం నైటీలతోనే వెళ్ళమారిపోతున్నాయి. మొదటి రాత్రి శోభనం గదిలోకి తెల్లచీర, పాల గ్లాసుతో వచ్చే బదులు అంతగా అయితే తెల్ల నైటీతో వెడతామనే వనితలు పెళ్లికూతుళ్ళుగా తారసపడుతున్నారట!

నైటీతో తప్ప పాలవాడు, పేపర్‌వాడు, పని మనిషి ఓ ఇంటి ఇల్లాలిని మరొకలా కనపడితే గుర్తుపట్టే పరిస్థితులు లేని కాలం వచ్చేసింది!

మార్నింగ్ వాక్‌కు నైటీయే!... కూరలు పొద్దున్నే కొని తెచ్చుకోవాలన్నా నైటీయే! కిట్టీ పార్టీలకు కూడా 'నైటీ'లతోనే తరలివెడుతున్నారట కొందరు.

“మీ ఫ్రెండ్స్‌ను ఎవర్నీ పొద్దున్నే ఇంటికి పిలవకండి!... నేను స్నానం చేసి చీర అదీ కట్టుకోడానికి కుదరదు” అని ఇల్లాలు తాఖీదు ఇచ్చేస్తోంది!... నైటీతో అతిథులకు ముందు రావచ్చు అంటే అభ్యంతరం పడడం, పడక పోవడం వారి ఇష్టమేనాయె!




నైటీలో బోలెడు రకాలు వచ్చేసాయి.

ఇప్పుడు చీరల షాపుల్లో చీరలకన్నా నైటీలే ఎక్కువగానూ, బోలెడు వెరైటీగానూ కనిపిస్తు న్నాయి!

పండక్కి పట్టుచీర కొనిపెట్టాలండీ! అని ఇల్లాలడిగితే “నువ్వు కట్టుకోనికాడికి, ఎప్పుడో గానీ వాడని వాటికి గాను అంత ఖర్చెందుకే! హాయిగా ఆ డబ్బుతో బోలెడు నైటీలు కొనుక్కో!” అన్నాట్ట ఒకాయన.

వాడకం విషయానికి వస్తే ఒక నైటీ పది చీరల పెట్టు అన్నట్లు ఇప్పుడు చీర కట్టుకోవడమే రాని తరం వచ్చేసింది!

చీర కట్టడానికి ప్రత్యేకంగా ఒక మనిషిని నియమించుకోవడం చేసే అమ్మాయిలూ, దానికి డబ్బులు చెల్లించి మరీ చీర కట్టుకునే సందర్భాలు ఈ కాలంలో మామూలైపోయాయి.

నైటీలు కాకపోతే, లేకపోతే చీరలు కట్టుకుంటారన్న భ్రమలేం పడక్కర్లేదు. మిడ్డీలు, పంజాబీ డ్రెస్సులు, ప్యాంట్లూ షర్టులూ నేటి అమ్మాయిలు హాయిగా వాడేసుకుంటున్నారు.


అన్నిటికన్నా అధికంగా అమ్ముడుపోతున్నవి నైటీలే అని ఆ మధ్య ఓ సర్వేలో తేలిందిట!

బంగారం నగలు కొనుక్కున్నా... మెడలో బదులు బ్యాంక్ లాకర్లలోనే వుంటాయి.... చీరలు కొనుక్కున్నా బీరువానే అలంకరిస్తాయి... ఒంటిమీద మాత్రం నైటీ తన డ్యూటీని బ్యూటీగా నిర్వర్తిస్తూ రాజసంగా వెలిగిపోతోంది.

నైన్ ఇయర్స్ అమ్మాయి అయినా... నైన్టీ ఇయర్స్ తాతమ్మ అయినా నైటీకే ‘డ్యూటీ’లు ఎక్కువ.

మహిళా రిజర్వేషన్ బిల్లు సంగతి సరేగానీ! ఎన్నికల కమీషన్‌కు మాత్రం ‘నైటీ’ని ఓ ఎన్నికల గుర్తుగా నిర్ధారించమని... అందువల్ల రాజకీయ మహిళా సాధికారత సార్థకత చెందుతుందనీ ఓ సూచన.







కథ-కథనం


**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**






# కొంగుచాటు కృష్ణుడు



**గత సంచికలో...** రంభ, ఊర్వశి, తిలోత్తమలు ముగ్గురూ కలిసి ప్రారంభించిన 'మన్మధా మెన్స్ బ్యూటీ పార్లర్' మూడవ బ్రాంచి ప్రారంభంతో పాటు 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీని ప్రకటించారు. ఆ పోటీలో పాల్గొనడానికి దేవలోకంలో అందరూ సిద్ధమవుతున్నారు... **ఆ తర్వాత...**

"ఏమి చాకిరీ సరస్వతీ?" లాలనగా అన్నాడు బ్రహ్మ.

"నాలుగు తలలకి తైలం వ్రాసి తయారు చెయ్యటం... మామూలు చాకిరీనా?"

"భర్త కోసం చేసేదాన్ని చాకిరీ అనరు వాగీశ్వరీ. సేవ అంటారు."

"వ్యాక్యాధిష్ఠాతృ రూపిణిని. భాష గురించి నాకు చెపుతున్నారా?" ఉక్రోషంగా అన్నది.

"కాదు భారతీ. 'చాకిరీ అంటే నాది' అంటున్నాను. క్షణం విరామం లేకుండా అనుక్షణం సృష్టిస్తూనే ఉండాలి... భూలోకవాసులకి 'బహు సంతానాపేక్ష తగ్గిన తరువాత 'గర్భాశయ నిర్మూలనలూ, భ్రూణ హత్యలూ పెరిగిన తరువాత' నా పని కాస్త తగ్గిందనుకో. కానీ పని పనే కదా! ఆ మాటకొస్తే బ్రహ్మ చాకిరీ అంటారు గానీ సరస్వతి చాకిరీ అనరు కదా!"

"గొడ్డు చాకిరీ, కుక్క చాకిరీ, గాడిద చాకిరీ, వెట్టి చాకిరీ అన్న పదాలు ఉన్నాయి గానీ బ్రహ్మచాకిరీ అన్న పదం లేదు స్వామీ. కొత్త మాటలని సృష్టించి, వాగ్దేవినే మాయ చేయబూనుతున్నారే."

"అంత మాట అనకు విద్య ప్రదాయినీ!... పద సృష్టి నీది.... పరలోక సృష్టి నాది. దానిలో అలసట నీకేమి తెలుసు? శతకోటి దేవతల కన్నా ఎక్కువ అలసిపోయేది నేనే".

"ఏమిటండీ అలిసిపోయేది? చిటికెడు మట్టి తీసుకొని 'ఉఫ్.. ఉఫ్' మని భూమి మీదకు ఊదటమేగా!"

బ్రహ్మకు కోపం వచ్చింది.

"ప్రాణ సృష్టి అంటే వీణ మీద 'టింగ్... టింగ్' మని వేళ్ళు కదపడం కాదు దేవీ... ఒక ప్రాణిని సృష్టించు. తెలుస్తుంది!" అన్నాడు.

వళ్ళు మండిన వరదాయని కాసింత మట్టి తీసుకొని గబగబా మూడు బొమ్మలకి ప్రాణం పోసి భూమ్మీదకి వదిలేసింది. అవి భూమ్మీద శిశురూపం దాల్చి ఒకే స్వరంలో, ఒకే లయలో కెవ్వు కెవ్వుమని ఏడుస్తోంటే, బ్రహ్మ కంగారు పడి క్రిందకు చూసి ఫకాలున నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నారు?" అని అడిగింది ఉక్రోషంగా.

"అందర్నీ మగ పిల్లల్నే సృష్టిస్తుంటే, మరి వారికి పెళ్లిళ్ళు ఎలా చేస్తావ్ పద్మాసనీ? మగవాడికి తోడుగా ఆడపిల్ల ఉండాలని తెలియని నువ్వు ఉత్తమ దంపతుల బహుమతికి బయలుదేరుతున్నావా? అయినా ఒక మాట... ఎవరి పని వారు చేస్తేనే బావుంటుందేమో ఆలోచించు... నువ్వు వీణాపాణిగా ఉంటేనే కవులు నిన్ను 'శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా హార తుషార' అని పొగుడుతారు. అంతే తప్ప, తుమ్మెదల్ని సృష్టించి పువ్వుల్ని మర్చిపోతే కాదు!" అంటూ దెప్పి పొడిచాడు.

అదెంత పని అన్నట్టుగా చక చకా మరో రెండు ఆడ బొమ్మల్ని తయారు చేసి భూమ్మీదకు వదిలి భర్త వైపు కళ్ళెగరేసి గర్వంగా చూసి, "చూశారా! ఇద్దరు మగాళ్ళ కోసం అరక్షణంలో ఇద్దరాడపిల్లల్ని తయారు చేశాను. ఈ రెండు జంటలూ భూమ్మీద ఉత్తమ దంపతులుగా జీవిస్తాయి. ఇదిగో... ఈ మూడో కుర్రాడికి మరో ఆడ బొమ్మ!" అంటూ ఉండగా బ్రహ్మ భూనభోంతరాళాలు దద్దరిల్లేలా కేక పెట్టాడు.

ఆ అరుపుకి అదిరిపడిన సరస్వతి అతడి వైపు అర్థం కానట్టు చూసింది.

"ఎంత పని చేశావ్ సరస్వతీ! కొంప మునిగిపోయింది!"

"ఏం చేశానండీ? ఏం తప్పు జరిగింది?" కంగారుగా

అడిగింది కమలలోచని.

"తప్పా... తప్పున్నరా! నా మొఖం".

"ముఖం కాదు. ముఖాలు అనాలి. నాలుగు ముఖాలు".

"నా ముఖాలపై నీ వ్యంగ్యం చాలు గానీ, ఇప్పుడు నువ్వు తయారు చేసిన ఆ మూడు ముఖాలు ఒకేలా ఉన్నాయి చూసుకో!" అంటూ తన నాలుగో మొహం ఆడపిల్లల వైపు తిప్పి మళ్ళీ కెవ్వున కేక వేశాడు.

"ఆ ఇద్దరు ఆడపిల్లలు కూడా ఒకేలా ఉన్నారు!".

పొరబాటు గ్రహించిన సరస్వతి "అయ్యో! ఇప్పుడెలా?" అంది.

"హతవిధీ!... ఒకే పోలికతో ముగ్గురు మగాళ్ళు. ఒకేలా ఉన్న మరో ఇద్దరు అమ్మాయిలూ... దేవ! దేవా!!... ఆ అయిదుగురి బ్రతుకుల్ని ఆ దేవుడే రక్షించాలి."

అప్పటికి సర్దుకున్న సరస్వతి, "దేవుడు రక్షించటం ఏమిటండీ? మనమే దేవుళ్ళం కదా!" అన్నది.

"అంతేనంటావా?!"

"అవును. వారి భవిష్యత్తు నేనే వ్రాస్తాను. వాళ్ళకేం కష్టం వచ్చినా నేను చూసుకుంటాను. ఉత్తమ దంపతుల జంట పోటీ సందర్భంగా... పుట్టిన ఆ జంటలే, ఆ భూప్రపంచపు ఉత్తమ జంటలయ్యేలా వారి జీవితాలు తీర్చిదిద్దు తాను.... ఇదే వారికి నేనిచ్చే వరం!" అని ధీమాగా అనేసి వెళ్ళిపోయింది.

'ఆడవారి మాటలు అస్సలు అర్థం కావు కదా! పుట్టేసిన తరువాత విధి వ్రాయటం ఏమిటో...' మనసులో అనుకున్నాడు విధాత.

✦✦✦

"అవతల అందాల పోటీ పెట్టుకొని... ఏవిఁటా తాండవం? తొందరగా తయారవ్వండి!" వేగిర పెట్టింది పార్వతి.

"నాదేముంది? నేను సిద్ధమే!" నాట్యం ఆపకుండా అన్నాడు శివుడు.


"ఏవిఁటీ? ఇలాగే వస్తారా?..." ఆశ్చర్యపోయింది అపరాజిత.


"మరెలా రావాలి?" అమాయకంగా ప్రశ్నించాడు నటరాజు.

"మనం వెళ్లేది అందాల పోటీకి. జంగం దేవర నాట్యానికి కాదు. మెడలో పాము, చేతిలో త్రిశూలం, ఒంటికి పులిచర్మం... ఇలా వెళ్తే బహుమతి కాదు కదా... లోపలిక్కూడా రానివ్వరు!" చిరాగ్గా అన్నది.

"రానివ్వక పోతే... అ అన్నులమిన్నల సౌందర్య వికాసాభివృద్ధి గృహాన్ని మూడో కన్నుతో కాల్చేస్తాను!"

"అక్కడ న్యాయనిర్ణేత కూడా మన్మథుడేనట.






ఒకసారి కాల్చారు కదా. చాలు!"

శివుడు గతుక్కుమని– "అతడికీ మనకీ పడదు కదా! ఆ పాత కక్షలు మనసులో పెట్టు కొని బహుమతి ఇవ్వడేమో?" అన్నాడు సాలోచనగా.

"మనక్కాకపోతే బహుమతి ఇంకెవరికి వస్తుందండీ?... పోతే మీ నెత్తిన నా సవతి ఉందని న్యాయ నిర్ణేతలు నిరాకరిస్తే మాత్రం చెప్పలేం!" దెప్పి పొడిచింది.

"అందరిలాగే నీవూ పొరపాటు పడుతున్నావు అర్ధాంగీ. నా నెత్తిన నెలవున్న ఆకాశ గంగ సంతనుడి భార్య!"


"పరాయివాని భార్యను నెత్తిన పెట్టుకుని ఊరేగటం మరింత పాపం".

"ప్రతి భార్యా అపార్థం చేసుకున్నట్టే నువ్వూ నన్ను అపార్థం చేసుకున్నావు... కంఠాన గరళాన్నీ, నెత్తిన గంగనీ పెట్టుకుని నాట్యం చేయటం నాకు మాత్రం ఇష్టమా చెప్పు? కానీ ఆ రెండిటినీ ఒకసారి వదిలేనంటే భూమ్మీద చరాచరాలు ఉండవు. కావాలంటే సర్వం తెలిసిన నీ తండ్రినే అడుగు చలికొండ కూతురా!"

పార్వతి నవ్వేసి– "నీహార క్షమాభృత్కుమార భైరవిని. నాకు తెలియనిదేముందండీ. పోతే న్యాయనిర్ణేతలకి 'మా మధ్య ఇప్పటి వరకూ ఏ తడి-పొడి గొడవలూ రాలేదని చెప్తే... భార్యాభర్తలన్నాక గొడవలు రాకుండా ఎలా ఉంటాయి...' అంటారు. అబద్ధం చెబుతున్నారని బహుమతి ఇవ్వరు. అర్థం చేసుకోండి భోళాశంకరులవారూ!..." విషయాన్ని తేలిక చేస్తూ అన్నది.

అలా వారి మధ్య మృదుమధుర సంభాషణ జరుగుతూ ఉండగా...

"శుభము శుభము కాత్యాయనీ" అంటూ నారదుడు అక్కడికి ప్రవేశించాడు.




"సమయానికి వచ్చారు నారద మహామునీ. మీరు త్రికాల జ్ఞానులు. రాబోయే పోటీలో ఎవరు విజేతలో చెప్పగలరా?" అన్నది పార్వతి ఉత్సుకంగా.

"పోటీలో ఎవరు గెలుస్తారన్నది చాలా చిన్న విషయం తల్లీ! నీ భవిష్యత్తు సంకటంలో పడబోతున్నది. ఆ విషయంలో కాస్త జాగ్రత్త పడు!" అన్నాడు నారదుడు.

"నా భవిష్యత్తుకి సంకటమా? ఏమి మాట్లాడుతున్నారు నారదా?"

"త్రికాల జ్ఞానీ అని నన్ను సంబోధించావు కాబట్టి త్రిపురసుందరీ, అటు సరస్వతి బ్రహ్మ లోకంలో ఏమి చేసిందో చూడు."

"ఏమి చేసింది?"

"భర్త చేసే పని తాను స్వయంగా చేపట్టి స్వీయప్రతిష్ఠ పెంచుకుంటున్నది".

"నాకు అర్థం కాలేదు నారదా!"

"బ్రహ్మలోకంలో ఏమి జరిగిందో ఒకసారి చూడు శాకంభరీ..." మంట పెట్టటానికి చేతిలోకి 'అరణి' తీసుకుంటూ అన్నాడు తగవుల మారి తాత.

***(అరణి**–హిందూధర్మంలో నిప్పు పుట్టించుటకు ఉపయోగించే సాధనమును 'అరణి' అంటారు. దీనిని జమ్మి కొయ్యతో చేస్తారు.)*

పార్వతి దివ్యదృష్టితో చూసింది. స్వేదం నుదుట పొరగా... మనసు కలత బారగా... మొహం ఎర్రబారగా, కోపంగా– "తానో అపర బ్రహ్మననుకుంటోందా ఆ సరస్వతి?" అన్నది.


"అవును!... భర్త పని స్వయంగా తాను చేపట్టి, అయిదుగురు అపురూప సౌందర్యవంతులని సృష్టించి భూమ్మీదకు వదిలింది.

తన కీర్తి కిరీటంలో మరో కలికితు రాయి చేర్చుకుంది."

"లేదు శాంకరీ! అందుకే ఆమె నిన్ను అధిగమించాలని అనుకొం టోంది... ఒక్క కష్టమూ లేకుండా బ్రతకమని వారికి వరములు కూడా ఇచ్చింది!" అంటూ ఒంటె నడుము మీద ఆఖరి గడ్డి పరక వేసి అక్కడినుంచి తప్పుకున్నాడు.

మంటలో మరో సమిధ వేశాడు కలహ భోజనుడు.

"అయిదుగురు! హు... నా భర్త ఆమె భర్త అయిదో శిరస్సు ఖండిం చాడని మర్చిపోయిందా?" అన్నది జగమునేలు వాని సగము.




అతడు అటు వెళ్ళగానే పార్వతీ దేవి 'హుటాహుటిన రమ్మని' సచీదేవికి కబురు చేసింది.

జగన్మాత ఆకస్మిక ఆదేశానికి ఇంద్రసతి కంగారు పడి, వరుణుడిని సాయమడిగి ఆగ 'మేఘా'ల మీద కైలాసానికి వచ్చి పార్వతి ముందు మోకరిల్లి–


"ఆజ్ఞాపించు కాత్యాయనీ!... ఎందుకీ పిలుపు?" అని అడిగింది.

"రావణాసురుడు నీ భర్త ఇంద్రుడిని నిర్వీ ర్యుడిని చేసి రాజ్యం నుంచి వెళ్ళ గొట్టినప్పుడు నా అన్న విష్ణువు 'రాముడి' రూపంలో ఆ రాక్ష సాధముడిని వధించాడు. నీ అత్త కుండ లాలను నరకాసురుడు సంగ్రహించినప్పుడు 'కృష్ణుడి' రూపంలో అతడిని సంహరించాడు. బలి చక్రవర్తి ఇంద్రలోకాన్ని ఆక్రమించి మీ దంపతులను నానా హింసలూ పెట్టినప్పుడు నా సోదరుడు 'వామనుడి'గా ఆ రాక్షసుడిని భూమిలోకి అణగదొక్కాడు...."

ఆమె మనసులో ఏదో కోరిక ఉన్నదని గ్రహించిన శచీదేవి వినయంగా–

"ఇన్ని మాటలు చెప్పాలా దాక్షాయణీ. ఆజ్ఞాపించు! నువ్వు ఏం చెప్తే అది చేస్తాను!" అన్నది.

"ఎగసిపాటుతో సృష్టికే ప్రతిసృష్టి చేసిన వాడు విశ్వామిత్రుడు. మిడిసిపాటులో అతడిని మించిపోయింది ఆ వాచాల వాగీశ్వరి. ఆమె గర్వం అణచాలి... దానికి నీ సర్వశక్తులు విని యోగించు. కావాలంటే నీ భర్త ఇంద్రుడి సహాయం తీసుకో."




"తప్పకుండా దేవీ! నీ కోరిక తీర్చడం కన్నా మించినది ఏమున్నది? ఇంతకీ ఏమి జరిగి నది?... నేనేమి చెయ్యాలి?..." అని సహస్ర లోచనుని సగభాగం అడగగా గౌరీపతి అర్ధ భాగం చెప్పటం ప్రారంభించింది.

ఆమె చెప్పినదంతా విని...


"ఎంతపని చేసింది! ప్రకృతికి విరుద్ధంగా, మనుష్యులకుండే సహజ కష్టాలకి అతీతంగా, భూమ్మీద ఏ బాధలూ లేకుండా... బ్రతకమని సృష్టించి పంపినదా?" అన్నది ఇంద్రసతి సాలోచనగా.

"కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్న సామెత వినలేదా?"

"ఆ అయిదుగురినీ 'ఎందుకు పుట్టామురా' అనుకునేలా చెయ్యాలి. అంతే కదా!"

"వద్దు! వద్దు!! మరీ హరిశ్చంద్రుడూ చంద్ర మతి బాధల్లాంటివి పెట్టకు... వారు తమ కష్టాలు ఎవరికైనా చెప్పుకున్నా, వినేవారికి నవ్వొచ్చేలా ఉండాలి. ఆ అపర త్రిశంకురాలికి తన స్థానం తెలియాలి అంతే..!" అన్నది గౌరి.

✦✦✦




"నారాయణ... నారాయణ" అంటూ బ్రహ్మ లోకం ప్రవేశించాడు త్రిలోకసంచారి.

"చూశావా నారదా! నా భార్య ఎంత గొప్ప పని చేసిందో! నా సృష్టికి ప్రతిసృష్టి చేసింది. అయిదుగురు పిల్లల్ని అవలీలగా సృష్టించి అవనిజ పై వదిలింది" సాదరంగా ఆహ్వానిస్తూ గర్వంగా చెప్పాడు చతుర్ముఖుడు.

"నీవే సృష్టికర్తవి. నీ సగభాగం తలుచు కుంటే జరగనిది ఏమున్నది జలజాతాసనా!" అన్నాడు త్రిలోకసంచారి.

నారదుడంతటి వాడు భార్యని పొగుడుతూ ఉంటే ఆనందంతో తబ్బిబ్బయినాడు బ్రహ్మ.

"మరొక విషయం చెప్పనా?... నుదుట కర్మలు వ్రాయటం మాత్రమే నాకు తెలుసు. కానీ నా సహచరి తాను సృష్టించినవారిని 'భూమ్మీద ఏ కష్టాలూ లేకుండా'...శాంతి సుఖ సౌభాగ్యములతో వర్ధిల్లమని ఆశీర్వదించి పంపింది".

"అదంత సులభం కాదనుకుంటాను... చతుర్ముఖా!"

ఆనందఝరిలా సాగుతోన్న వాక్ప్రవాహానికి నారదుని మాట ఆనకట్టలా అడ్డు తగిలి బ్రహ్మ అవాక్కయ్యాడు.

వారి సంభాషణ వింటూన్న సరస్వతి కోపంగా–"ఏం? ఎందుకని?" అని అడిగింది.

కలహభోజనుడు చెప్పటానికి తటపటా యించాడు (అని అనుకున్నారు ఆ దంపతులు. కానీ అది నిజము కాదు. ఉత్సుకత పెంచ టానికి ఆగాడంతే).

"సంశయమెందుకు? చెప్పండి నారద మునీంద్రా!" అన్నాడు బ్రహ్మ.

"స్వీయసృష్టితో సరస్వతి తన ప్రతిష్ఠను మరో మెట్టు పెంచుకున్నదని జగన్మాతకి తెలిసింది. అంతేకాదు. విధి వ్రాతకు వ్యతి రేకంగా, తన సృష్టికి ఏ కష్టాలూ రాకుండా వరమిచ్చిన విషయం కూడా తెలిసింది."

"తెలిస్తే?" సరస్వతి భృకుటి ముడివడింది.

"నీ వరాన్ని వమ్ము చేస్తానని... ప్రతిన పూనింది తల్లీ! నీవు సృష్టించిన ఆ జీవులకి భూమ్మీద నానా కష్టాలూ సృష్టించమని ఆ శివపత్ని ఈ ఇంద్రసతికి చెప్పింది."

"ఎందుకు?"




'వేడెక్కిన నీరు ఆవిర్లు కక్కటం కోసమా' అన్నట్టు నారదుడు కాస్సేపు మౌనం వహిం చాడు. ఆ అరక్షణ నిశ్శబ్దాన్ని కూడా భరించ లేనట్టు సరస్వతి ఉత్సుకంగా చూసింది.

కైలాసంలో జరిగింది వివరంగా చెప్పాడు నారదుడు.

"నాకేమీ అర్థం కావడం లేదు నారదా!..." బ్రహ్మ అయోమయంగా అన్నాడు.

"అభం శుభం తెలియని ఆ జీవాలను కష్టాలు పెట్టడం ఏమిటి? అలా పెట్టమని పార్వతి ఇంద్రసతిని ఆజ్ఞాపించడమేమిటి?"


"దీని వెనుక కూడా కొన్ని విశేషాలు ఉన్నాయి పద్మనాభ సుతా! దాదాపు అరవై సంవత్సరాల క్రితం జంబుద్వీపే భారతఖండే కావేరీ, కూవం నదీతీర మధ్యే... 'సరస్వతీ శపథం' అని ఒక తమిళ చిత్రమూ గోదావరీ–నాగావళీ–స్వర్ణముఖీ మధ్య తీరంలో దాని తెలుగు అనువాదమూ విడుదల అయ్యాయి. గుర్తుందా తండ్రీ?" అని అడిగాడు నారదుడు.

"గుర్తుంది. ముగురమ్మల్లో ఎవరు గొప్ప అని లక్ష్మీ, పార్వతి, సరస్వతి వాదులాడు కుంటారు. అదే కదా ఆ చిత్ర కథాంశం".

"అవును. ఆ చిత్రం చివర్లో సరస్వతి గొప్ప అని అన్యాపదేశంగా చెబుతారు".

'కావేరి, కూవం నదుల మధ్య ప్రాంతం–తమిళనాడు... గోదావరీ, నాగావళీ, స్వర్ణముఖి నదుల మధ్యప్రాంతం–సంయుక్త ఆంధ్రప్రదేశ్.

**(సశేషం)**


టీవీ ఫన్
అమ్మా!...
నిజంగా ఈ సబ్బు నా వంటికి మంచిదేనా?!... ఎందుకంటే నేను దీన్ని ఎప్పుడూ టీవీల్లో చూడలేదు!!
మీరేమో పెద్దలకు మాత్రమే సినిమాలు నన్ను చూడనివ్వరు... అందుకే నేనూ మిమ్మల్ని ఇది చూడనివ్వను!'
పిల్లల సినిమా
చిచ్చర పిడుగు
Subhani




ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.

డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ పాలక మండలి సభ్యులు*
90320 44115

(గత సంచిక తరువాయి)

**"వా**క్యం రాసేటప్పుడు చాలా స్పష్టంగా, అర్థవంతంగా ఉండేలా పదాలు ఎంచుకోవాలి. ముఖ్యంగా వాటికి దీర్ఘాలు, వత్తులు ఇచ్చే విషయంలో చాలా జాగ్రత్త తీసుకోవాలి. ఈ పుస్తకంలో ఓ చోట **'ఆ ఇంటికి ఒక్కడూ వెళ్ళడు'** అని రాసాడు రచయిత. నిజానికి, ఆ సందర్భంలో రాయాల్సింది **'ఆ ఇంటికి ఒక్కడు వెళ్ళడు'** అని.

ఎందుకంటే, ఓ వ్యక్తి తప్ప ఆ ఇంటికి అందరూ వెళ్తారు. 'ఒక్కడూ వెళ్ళడు' అన్నప్పుడు ఒక్కడు కూడా ఆ ఇంటికి వెళ్ళడు (నాట్ ఈవెన్ వన్ పర్సన్) అని అర్థం వస్తుంది. వాస్తవానికి ఒక్క వ్యక్తి తప్ప అందరూ ఆ ఇంటికి వెళ్తారు. కాబట్టి, ఆ ఇంటికి ఒక్కడు వెళ్ళడు అని రాయాలి.

"అదేంటి నాన్నా... ఒక్క దీర్ఘం ఎక్కువ రాయటం వల్ల ఇంతగా అర్థం మారి పోతుందా?" అంటూ ఆశ్చర్యపోయింది మనోజ్ఞ.


"అంతేకాదు చిన్నమ్మా... ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయి. ఒకే వాక్యంలో వరుస పదాలు రాసేటప్పుడు కొంతమంది మనసుని, గడపని, పడవని అంటూ ప్రతి పదానికి చివర 'ని' రాస్తారు. కానీ, **అకారాంత, ఉకారాంత పదాలకు చివరలో 'కు' లేదా 'ను' రాయాలి. ఉదాహరణకు మనసును, పొడవును, సంభాషణకు, భావనకు...** ఇలాగన్నమాట."

"మరి 'ఇ' కారాంత పదాలకు ఏం రాయాలి నాన్నా?" అంటూ మనోజ్ఞ అడగటంతో నా ఆనందం రెట్టింపు అయ్యింది.

""ఇ' కారాంత పదాలకు 'ని' లేదా 'కి' వస్తుంది చిన్నమ్మా. ఉదాహరణకు మనవికి, ధరణికి, మనిషిని, ఆర్తిని... ఇలాగన్నమాట.


"మరి నాన్నా! మా తెలుగు పాఠ్యపుస్తంలోని ఓ పద్యంలో 'ఇప్డు' అని ఉంది. 'ఇప్పుడు' అని కదా రాయాలి. పద్యం రాసిన వాళ్ళు గొప్ప కవులు కదా. మరెందుకలా రాసారు నాన్నా. చెప్పు..." అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది మనోజ్ఞ.

"నువ్వన్నది నిజమే తల్లీ. నువ్వు చదివిన పద్యంలో ఉన్న 'ఇప్డు' అనే పదం సరైనదే. వ్యాకరణం ప్రకారం కూడా అది సరైన ప్రయోగమే. కాకపోతే, ఏ పదాన్నయినా పలికేటప్పుడు మన చెవులకు ఇంపుగా వినిపించాలి. ఎబ్బెట్టుగా ఉండే పదాలు ఉపయోగించకూడదు. అలా జరగనప్పుడు ఎంత గొప్ప కావ్యాలు రాసినా ప్రయోజనం లేదు. వ్యాకరణ సూత్రాలు, ఛందో నియమాలు పాటిస్తూనే సాధ్యమైనంత ఎక్కువగా పాఠకుల ప్రయోజనాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. పాఠకులకు తేలికగా అర్థం కాని రచన ఏదైనా సరే, అది వ్యర్థమే అవుతుంది."



'అమ్మనుడిని అటకెక్కిస్తారా!' సౌజన్యంతో

"నాన్నా... నువ్వు మరీ సూటిగా మాట్లాడుతున్నావు. ప్రతి విషయాన్నీ ఇంతగా పరిశీలిస్తున్నావు. నిజానికి ఇంతగా పట్టించుకుని రాయకపోతే ఏమవుతుంది నాన్నా!" అంటూ ప్రశ్నలు కురిపించింది మనోజ్ఞ.




"అవును తల్లీ... నువ్వన్నట్లు మరీ చిన్న చిన్న విషయాలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు... దానివల్ల భాషకు పెద్దగా వచ్చిన నష్టమూ లేదు. కానీ, నేను చెప్పిన సూచనలు పాటిస్తూ, భాషాపరంగా జాగ్రత్త తీసుకోవడం వల్ల మన రచనల్లో స్పష్టత వస్తుంది. సవ్యత, సూటిదనం చోటుచేసుకుంటాయి.

భాషాసవ్యత సాధించడానికి పరిమితి ఏదీ ఉండదు. ఎంత బాగా రాసినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదో పదానికి సంబంధించి అనుమానం వస్తూనే ఉంటుంది. భాషావేత్తల సలహాలు తీసుకోవటం, ప్రామాణిక నిఘంటువులు పరిశీలించడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే భాషాపరమైన దోషాల్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవచ్చు. ఇలా చేయడం వల్ల భాషకు, మన రచనకు మేలు జరుగుతుందే కానీ హాని జరగదు."

"అయ్యా మహానుభావుడు గారూ!... అయిందా మీ క్లాసు. ఆదివారాలు కూడా మాకు తెలుగు క్లాసులు తప్పడం లేదు... మీరంటే అక్షరాలు తిని, భాషను తాగి ఆకలి తీర్చుకుంటారు. మాకది సాధ్యం కాదు కదా! వంట పూర్తయింది. కూతురు మీద, భాష మీద ప్రేమ కట్టిపెట్టి భోజనానికి రండి!" అంటూ మురిపెంగా తిడుతూ కమ్మని భోజనానికి ఆహ్వానం పలికింది కాంతం.

"అవును... ఇవాళ అమ్మ వంకాయ కారం పెట్టి కూర చేస్తానంది... నాన్నా నీకిష్టం కదా... పద కుమ్మేద్దాం!" అంటూ నా చేయి పట్టుకుని లాగింది చిన్నారి మనోజ్ఞ.

✦✦✦

"ఏమండోయ్!... నాకేదో అనుమానంగా ఉందండీ..." అంటూ రత్నం నేను సేద తీరుతున్న వాలుకుర్చీ పక్కనే వయ్యారంగా కూర్చుంది.

ఆ భంగిమ, ముఖంలో భావం ఏమిటో ఎంతగా విశ్లేషించుకున్నా అర్థం కాలేదు నాకు.

"ఇప్పుడేమైందని నేను నీ మాట వింటూనే ఉన్నాగా అంటూ నేనూ వంకరలు పోయాను సత్యభామ అలిగిన వేళలో శ్రీకృష్ణుడి మార్గాన్ని అనుసరిస్తూ.

"అబ్బా... ఛా! అది కాదండీ అంటూ ఇంకా వయ్యారాలు పోయింది రత్నం.


ఈ విచిత్రమైన సంఘటనకి తట్టుకోలేక పోతున్నా. అసలేం జరిగి ఉంటుంది. నిజంగా నేను తప్పు చేసినా, నా మీద ఎవరైనా చాడీలు చెప్పినా ఈపాటికి జాడీలు పగిలిపోయేవి. కానీ, వయ్యారాలు పోతూ, సిగ్గుపడుతూ, పైగా అనుమానం అంటోంది రత్నం. ఏం జరిగి ఉంటుంది? మనసులో వెయ్యి ఆలోచనలు.

రత్నం మాత్రం నాగుపాముతో పోటీనా అన్నట్లు వంకరలు తిరగటం ఆపటం లేదు. ఈ వింతఘటన ఏమిటో తెలియక జుట్టు పీక్కుందామని అసంకల్పితంగా చేతులు నెత్తి మీదకు చేరినా అక్కడ ఉన్న నాలుగు వెంట్రుకలు ఇంకా భీష్మించుకున్నాయి.

"అలా కాదు రత్నం! నువ్వు మామూలుగా మాట్లాడితేనే పూర్తిగా అర్థం కావటం చాలా కష్టం. అలాంటిది ఇప్పుడిలా వింతభంగిమలతో పోటీపడుతూ సిగ్గుపడితే తట్టుకోవటం కష్టంగా ఉందే. అసలేం జరిగిందో చెప్పి నాకీ నరకం నుంచి విముక్తి కల్పించు!" అంటూ తన గడ్డం పట్టుకుని బతిమిలాడాను.

"అంటే... అది కాదండీ... రోజూ తెల్లవారు జామునే ఎవరో మన వాకిలిముందు తచ్చాడుతున్నట్లు, గోడ మీద నుంచి చూస్తున్నట్లు అనిపిస్తోందండీ. కల కాదు... నిజంగానే. తెల్లవారు జామున ఐదుగంటల సమయంలో ముగ్గువేయటానికి వెళ్తానా..."

**(ఏం జరుగుతోంది... వచ్చే సంచికలో)**






## సాంస్కృతిక సౌజన్యమూర్తి

# డా॥ కె.వి.రమణగారి 72వ జన్మదిన వేడుకలు





**'సాంస్కృతిక బంధు'** సారిపల్లి కొండలరావుగారి సారధ్యంలో... సత్కళాభారతి, యువకళావాహిని, తెలంగాణరాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి,8,2024న హైదరాబాద్, రవీంద్రభారతిలో డా॥ రమణగారి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగింది.

ఈ సభలో తెలంగాణ రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమ శాఖామాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ మామిడి హరికృష్ణ, డా॥ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు శ్రీ సారిపల్లి కొండలరావు, ప్రముఖ సాహితీవేత్త, కవి డా॥ ఓలేటి పార్వతీశం, 'సత్కళాభారతి' శ్రీసత్యనారాయణ, యువకళావాహిని అధ్యక్షులు శ్రీ లంక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమలో జానపద కళాకారులు జానపద కదంబం, చైతన్య కళాభారతి కరీంనగర్‌వారు **'స్వప్నం రాల్చిన అమృతం'** నాటిక ప్రదర్శించారు.

కళాకారుల గుండె చప్పుడు డాక్టర్ రమణాచారిగారని వక్తలు కొనియాడారు.

# శ్రీ గుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన
# కార్టూన్ పోటీల బహుమతి ప్రదానోత్సవం

**డా॥కె.వి.**రమణగారి జన్మదిన వేడుకలలో భాగంగా శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కార్టూన్ పోటీల బహుమతి ప్రదానోత్సవం... ఫిబ్రవరి,12,2024న హైదరాబాద్, త్యాగరాయ గాన సభలో ఘనంగా జరిగింది. ఈ సభలో అతిథులుగా డా॥ కె.వి.రమణ గారు, జస్టిస్ బి.శేషశయనారెడ్డి, లయన్ డా॥ చిల్లా రాజశేఖరరెడ్డి, శ్రీలంక లక్ష్మీనారాయణ, శ్రీ పి.రాము, శ్రీ కొండపాక కృష్ణమాచార్యులు, డా॥ లక్కరాజు నిర్మల, శ్రీ పెద్దూరి వెంకటదాసు పాల్గొన్నారు.

డా॥కె.వి.రమణ దంపతులను ముఖ్యఅతిథులు సత్కరించారు.

పోటీకి వచ్చిన కార్టూన్లతో రూపొందించిన 'ఎయిటీత్రీ ఫన్ టూన్స్' సకలనం ముఖ్య అతిథి జస్టిస్ బి.శేషశయనారెడ్డి ఆవిష్కరించారు.





'ఎయిటీత్రీ ఫన్ టూన్స్' ఆవిష్కరణ



బహుమతి గ్రహీత సుబ్రహ్మణ్యం



బహుమతి గ్రహీత ఎ.దయాకర్



బహుమతి గ్రహీత కృష్ణ



బహుమతి గ్రహీత అరుణ్



బహుమతి గ్రహీత బివిఎస్



బహుమతి గ్రహీత చక్రవర్తి



బహుమతి గ్రహీత శర్మ



బహుమతి గ్రహీత బసవేశ్వర్



బహుమతి గ్రహీత క్రిష్



బహుమతి గ్రహీత సౌమ్య

# వింటావా నా బాధ!

కె.వి. సుమలత,
9492656255



**ప్రి న అమ్మకి,**

**ఇక్కడంతా క్షేమం... మీరు కూడా అక్కడ క్షే నా?...**


**ఈ ప్రి న లు, క్షే నా లు ఏమిటా అని ఆశ్చర్యపోతున్నావా? ఏం చేస్తాను చెప్పు? ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారట! అలా పీనాసి మొగుడితో ఆరు నెలల నుండి కాపురం చేస్తున్నాను కదా! ఆ పీనాసితనం నాకూ వచ్చేసింది. అక్షరాలలో కూడా పొదుపు వచ్చేస్తుంది.**

**సరేలే! ఎలా చదవాలో తెలియక భయపడకు... నీకు అర్థమయ్యేలా రాస్తాను.**

అక్కడ నాన్న పిసినారితనం బారి నుండి తప్పించుకున్నాను అనుకున్నాను కానీ అంత కన్నా పీనాసి దగ్గరకొచ్చి పడ్డాను.

నాన్న పొరుగు వాళ్ల పేపర్ కాసేపటి కోసం 'అడుక్కొచ్చి' చదువుకొమ్మని మనకు ఉదారంగా ఇచ్చేవారు. ఇక్కడ మా ఆయన వాట్సప్‌లో వచ్చిన న్యూస్‌పేపర్ కూడా నాకు ఫార్వర్డ్ చేస్తే నెట్ అయిపోతుందని ఆయన ఫోన్లోనే చదవమంటారు.

అయ్యో రామా! మొన్న దసరా నవ రాత్రులలో ఉదయం, రాత్రి రెండు పూటలూ ఇంట్లో వంట చేయనివ్వలేదు... నాలుగు గుడులు తిప్పి ప్రసాదాలు తినిపించి సరిపెట్టేసారు. అర్ధాకలితో నాకు ఏడుపు వచ్చేసింది. పైగా 'ఇప్పుడు నేనేమన్నానని అంతగా ఏడుస్తున్నావు?... ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?" అని గొడవ చేసారు. పైగా 'మనం ఎన్ని రకాల టిఫిన్లు తింటున్నామో' అని అంటుంటే నాకు పీకల దాకా






కోపం వచ్చి ఏడుపు ఆపుకున్నాను.

దీపావళి వస్తుంది కదా! ఇప్పటి నుండే నాకు భయం వేస్తుంది. పందిర్లు, భోజనాలు ఉండవు కానీ కాలకుండా... పడున్న బాంబుల కోసం అందరి వాకిళ్ళు ఎక్కడ వెతకమంటారోనని...

నీకు మరో విషయం చెప్పనా? మొన్న గుడికెళితే జనం మధ్యలో దూరి చెయ్యి మార్చి మరో చెయ్యి చాచి రెండుసార్లు ప్రసాదాలు తీసుకుంటుంటే ఒకావిడ పసిగట్టేసి– 'ఇంత కక్కుర్తి పడుతున్నావేంటయ్యా?... చూడటానికి బాగానే ఉన్నావు కదా?" అని ఆయన్ని కడిగి పారేసింది.

సిగ్గుతో నాకు తల కొట్టేసినంత పని అయిందనుకో!... గబ గబా ఆయన దగ్గర నుండి దూరం జరిగాను నన్నెక్కడ తిడుతుందోనని.

ఎక్కడ పందిరి వేసి భోజనాలు పెట్టినా మా ఆయనకి తెలిసిపోతుంది ఇక ఆ రోజు మా ఇంట్లో వంట ఉండదు. భోజనాలకు వెళ్లి అక్కడ లొట్టలు వేసుకుంటూ తింటారు. నన్నూ తీసుకు వెళ్తారు కాబట్టి దొంగలాగా ఎవరైనా ఎవరు నువ్వు అని అడుగుతారేమోనని తల దించుకుని తింటాను. కానీ ఆయన మధ్య మధ్యలో నా వైపు చూసి భలే రుచికరమైన భోజనం తినిపిస్తున్నాను కదూ అంటారు. అప్పుడు నాకు ఒళ్ళు మండిపోతుంది.

మన ఇంట్లో నాన్న నెలకోసారయినా బిర్యానీ వండుకోనిచ్చేవారు. కానీ ఇక్కడ బిర్యానీ తినాలి అంటే ఎవరింట్లోనైన ఫంక్షన్ జరగాలి. అప్పుడు ఉచితంగా బిర్యానీ తినాలి.

ఆ!... ఇంకో సంగతి చెప్పడం మరచిపోయాను!

"దసరా పండుగకు, దీపావళి పండుగకి సెలవులు లేవుగా అల్లుడు గారు! సంక్రాంతికి వద్దురు గానీ..." అని మా ఆయనతో అన్నారు నాన్న.

"అందుకే సంక్రాంతికి వెళ్ళినప్పుడు దసరా కానుక, దీపావళి కానుకతో కలిపి మూడు కానుకలు ఇవ్వమని మీ నాన్నకి చెప్పు" అని నాకు పదే పదే గుర్తు చేస్తున్నారు. ఈ విషయం నాన్నకి మరచిపోకుండా చెప్పమ్మా! లేకపోతే ఇచ్చేదాక మా ఆయన అక్కడే తిష్ఠ వేసుకొని కూర్చుంటారు. నాన్నని మించిన పీనాసి కదా!

మాట్లాడితే 'అత్తయ్య గారిని చూసి వద్దాం' అంటున్నారు. నీ చేతి గారెలు, బూరెలు... ఇప్పటి నుండే ఊహించుకుంటూ భుక్తాయాసంతో బ్రేవ్ బ్రేవ్ మని త్రేన్పులు తీస్తున్నారు.

అమ్మా! ఎందుకు వెతికి వెతికి ఇంత పినాసిని నాకు అంటగట్టారు? మా ఆయన కంటే మీ ఆయనే కొంచెం నయమని నాకు పెళ్లయ్యాకే తెలిసింది.

పొట్టిగా అయిపోయిన షర్టులు, నలిగిపోయిన ప్యాంటులు వేసుకొని దీనాతి దీనంగా ఆఫీస్ కి వెళ్తుంటే చూడలేక చచ్చిపోతున్నాను. పండగకి నాన్నని కాస్త మంచి బట్టలు కొని పెట్టమని చెప్పు. మరీ అడుక్కునే వాళ్ళతో పోటీ పడుతున్నారు.

మొన్న పక్కింటికి అడుక్కునే వాడు వస్తే మా ఆయన చూడకుండా బట్టలు ఇద్దామనుకున్నాను.

అప్పుడయినా కొత్తవి కొనుక్కుంటారని ఆశపడ్డాను.

కానీ అతను "నా బట్టల కన్నా ఘోరంగా ఉన్నాయి... నాకు వద్దు బాబోయ్" అంటూ వెనుకకు తిరిగి చూడకుండా పారిపోయాడు.

ఇంకా చెప్పాలంటే మా ఇంటికి అడుక్కునే వాళ్ళు ఎవరూ రారు. మా ఆయన సంగతి వాడకట్టులో అందరికీ తెలుసు. మా ఆయనకి అంతటి కీర్తి ప్రతిష్టలు ఉన్నాయి.

అమ్మా! తిండికి మొహం వాచి పోయి ఉన్నాను. అక్కడకు వస్తేనన్నా నాలుగు రకాల వంటలు తిందామంటే, నాన్న అల్లుడికి బట్టలు పెట్టాలని బెంగ పెట్టుకొని వండే వంటల్లో కోత విధిస్తాడేమోనని... అదో సందేహం!

అమ్మా, ఒక పని చేద్దామా? వీళ్లిద్దరికీ విరోచనాల మందు కలిపి హాస్పిటల్ లో చేర్పించి కదలకుండా సెలైన్ పెట్టిస్తే గొడవ వదులుతుందనిపిస్తుంది. అప్పుడు మనం కమ్మగా వండుకొని తినొచ్చు! నాకయితే ఏదో ఒక ప్లాను వేయాలనిపిస్తుంది. నువ్వు కూడా ఈ నాలుగు రోజులు ఆలోచించు. నేను కూడా ఆలోచిస్తాను.

వీళ్ళకి పిసినారితం వదిలే ఐడియాల కోసం గూగుల్‌లో చూద్దాం అంటే నా ఫోన్‌లో నెట్ ఉండదాయే! అక్కడకు వచ్చినాక అదే పనిలో ఉంటాను.

సరేలే అమ్మా! నీకు ఉత్తరం రాసానని తెలిస్తే ఈ సాయంత్రం మా ఆయన టీ తాగడం మానేస్తాడు. ఎందుకంటే కవర్ ఖర్చు బ్యాలన్స్ చేయాలని! ఎలాగూ వెళ్తున్నాము కదా అప్పుడు ఎదురుగా కూర్చుని మాట్లాడుకోవచ్చు కదా అని పాయింట్స్ తీస్తాడు. ఆయన వచ్చే లోగా పక్కింటి అబ్బాయి తో పోస్ట్ చేయిస్తాను.

ఉంటానిక!

ప్రేమతో... సరయు.

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846


## దోస్తీకి నజరానా!

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వెలగబెడుతున్న దేవానంద్ తను ఆశించినంత కట్నం ఎవరో ఒకరు ఇవ్వక పోతారా... అని వెయిటింగ్ చేసి, చేసి చివరకి మూడు పదులు వయసు దాటిపోయి తొమ్మి దేళ్ళు అయినా తన ఆశ నెరవేరలేదు.

దాంతో ఇప్పుడు తనకి పిల్లని ఇచ్చే వాళ్ళు లేకపోవడంతో... పెళ్లి అంటే లైఫ్‌లో అదొక ఎక్స్‌ట్రా లగేజీ అనీ బ్రహ్మచారి జీవితమే సుఖ మయం... అని చెప్పుకుంటూ జీవనం సాగి స్తున్నాడు.

సదరు దేవానంద్‌కు వైజాగ్‌లో సోంబాబు అనే ఒక దోస్త్ వున్నాడు. అతనితో తన దిక్కు మాలిన ఆలోచనలు, అభిప్రాయాలను షేర్ చేసుకుంటూ ఉంటాడు.

ఇకపోతే దేవానంద్ తన చిన్ననాటి క్లాస్ మేట్ జయరాం. తను చేసిన రోడ్ కాంట్రాక్ట్ బిల్లు నిమిత్తం మినిస్టర్‌తో మాట్లాడడానికి హైదరాబాద్ వస్తున్నట్టు చెప్పాడు. ఇదివరకు అలా వస్తున్నట్టు రెండు మూడుసార్లు చెప్తే తను బెంగుళూరు లోనో, చెన్నైలోనో వున్నట్టు అబద్ధం చెప్పి తన ఇంటికి రాకుండా చేసే వాడు. కానీ ఈసారి జయరాం తన భార్యతో కలసివస్తున్నట్టు చెప్పడంతో తన హైదరాబాద్ లోనే వున్నట్టు చెప్పి తన ఇంటికి తప్పకుండా రమ్మన్నాడు.




జయరాం భార్య దేవానంద్ ఊహించిన దానికంటే ఓవర్ ద టాప్ అందంగా వుంది. ఆమె పేరు కావ్య. ఏవరేజ్ అందంగా వున్న జయరాంకు ఇంత బ్యూటిఫుల్ భార్య వున్నం దుకు జెలస్ ఫీలయ్యాడు దేవానంద్.

దేవానంద్ ఆఫీస్‌కు వెళ్తూ జయరాంను మినిస్టర్ ఇంటిదగ్గర దింపాడు.

"మినిస్టర్‌తో పని అవ్వగానే నాకు కాల్ చెయ్. ఆఫీసులో పర్మిషన్ అడిగి వస్తాను... ముగ్గరం కల్సి ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్లి లంచ్ చేద్దాం" అని అన్నాడు దేవానంద్.

"సరే!" అన్నాడు జయరాం.

దేవానంద్ ఆఫీస్‌కు వెళ్ళే దారిలో ఉండగానే జయరాం కాల్ చేశాడు.

ఆ మినిస్టర్ సిద్ధిపేట వెళ్తూ తనని కూడా తీసుకెళుతున్నాడనీ... తను రావడానికి సాయంత్రం అవుతుందని చెప్పాడు.

అంటే సాయంత్రం వరకు కావ్య ఒంటరిగా వుంటుంది. ఆమెతో ఫ్లర్ట్ చేయడానికి ఇదే సరైన అవకాశం అని దేవానంద్ చెత్త బుర్రకు తోచింది.

ఇంటికి వచ్చిన దేవానంద్ ఏదో కారణం చెప్పి, ఆఫీస్ లేదనీ అందుకే తను వచ్చేసినట్టు కావ్యాతో అబద్ధం చెప్పాడు.

మేకప్ వేసుకున్న సినిమా హీరోయిన్‌లా ఇప్పుడు చాలా అందంగా రెడీ అయి వుంది కావ్య.

ఫ్రెండ్ భార్య అనే నీతి నియమం లేకుండా వీలయితే డైరెక్ట్‌గా లేదా ఇన్‌డైరెక్ట్‌గా కావ్య అందాల్ని స్కాన్ చేస్తున్నాడు దేవానంద్.

కొన్ని గంటల్లోనే కావ్య తనతో చనువుగా మాట్లాడేటట్టు చేసుకోవడమే కాకుండా తన రసిక చేష్టలకు రెస్పాండ్ అయ్యేట్టు చేసు కున్నాడు దేవానంద్.

కొన్ని నిజాలు చాలా అబద్ధాలు మిక్స్ చేసి జయరాం పెళ్ళికి ముందు అమ్మాయిలతో ఆంటీలతో తిరిగే వాడని చెప్పాడు దేవానంద్.

అది నిజమని నమ్మి జయరాం మీద తనకు వున్న కంప్లైంట్స్ అన్నీ వెళ్ళగక్కింది కావ్య.

మొత్తానికి లంచ్ టైం కే జయరాంని నెగటివ్ క్యారక్టర్ చేసేశాడు దేవానంద్.

ఇప్పుడు కావ్య దృష్టి లో జయరాం ఒక చీటర్ అనే భావన క్రియేట్ చేశాడు.

కావ్య తనతో చనువుగా మాట్లాడుతున్న పద్ధతి గురించి తను చెప్పే అడల్ట్ జోకులకు అడ్డు చెప్పకపోగా వాటికి నవ్వడం గురించి ఫ్రెండ్ సోంబాబుతో షేర్ చేసుకున్నాడు దేవానంద్.

"రేయ్! ఆమె తన భర్త ఫ్రెండ్ కదాని నీతో చనువుగా మాట్లాడుతుందేమో చూస్కో... తొందరపడి హద్దు మీరద్దు! ఒకవేళ నువ్వు అలా చేస్తే ఆమె నీ గురించి నీ ఫ్రెండ్‌కు గ్యారంటీగా చెప్తుంది అప్పుడు నువ్వు అతనికి శాశ్వతంగా దూరం అయిపోతావ్... గుర్తు పెట్టుకో!" అని వార్న్ చేశాడు సోంబాబు.


దేవానంద్ అదేమీ ఆలోచించే స్థితిలో లేదు.

శృంగారవాంఛతో రగిలి పోతున్నాడు. కావ్య పొందు కోసం సల సల కాగిపోతున్నాడు.

రాత్రి ఎనిమిది అవుతుండగా కావ్యాకు జయరాం ఫోన్ చేసి మినిస్టర్ ఈ రాత్రికి ఇక్కడే వుండి... రేపు పొద్దునే వెళ్దామన్నాడని చెప్పాడు.

ఇది తెల్సుకున్న దేవానంద్ ఆనందం ఆకాశం ఎక్కి కూర్చుంది. కావ్యాను ఎలా లోబర్చుకోవాలో చక చకా అలోచించడం మొదలుపెట్టాడు.

✦ ✦ ✦




మినిస్టర్ దగ్గరి నుండి పని ముగించుకుని పొద్దున్నే వచ్చాడు జయరాం. నాలుగురోజులు ఉందామని వచ్చిన జయరాం ఊర్లో అనుకోకుండా అర్జంట్ పని పడడంతో భార్యతో కలసి వెంటనే బయలుదేరి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అవుతుండగా జయరాం, దేవానంద్ ల కామన్ ఫ్రెండ్ కార్తీక్ వచ్చాడు.

జయరాం తన భార్య తో ఇక్కడికి వచ్చినట్టు కార్తీక్ తో చెప్పాడు దేవానంద్.

"అదేంటీ! తను జారి పడ్డం వల్ల వారం క్రితం తన కాలు విరిగిందనీ దాంతో మూడు నెలల వరకు నడవడం కూడా చేయద్దని డాక్టర్ చెప్పాడట. అదే విషయాన్ని నాకు నిన్న ఫోన్ చేసి జయరాం భార్య చెప్పింది... మరి తను ఇక్కడికి ఎలా వచ్చింది?" అని తన డౌట్ ని ఎక్స్ ప్రెస్ చేశాడు కార్తీక్.

అంతే కాకుండా ఆమె తన కాలికి కట్టు కట్టుకుని తీయించుకున్న ఫోటో కూడా చూపించాడు కార్తీక్.

అది చూసి దయానంద్ షాక్ అయ్యాడు.

అక్కడ వున్నది కావ్య కాదు... అంటే జయరాం భార్య కావ్య కాదా? మరైతే కావ్య ఎవరు?

కార్తీక్‌కు కావ్య ఫోటో చూపించి–

"ఈమె ఎవరు ?"అని అడిగాడు దేవానంద్.

అది చూసిన కార్తీక్ "ఈవిడ ఫోటో నీకెలా వచ్చింది ?" అని... అదోలా నవ్వి–

"తను ఒక వేశ్య! ఆమెది జయరాం వాళ్ళ పక్క ఊరు. వాడు ఎక్కడికి వెళ్ళినా తనని తన కూడా తీసుకుని వెళ్తుంటాడు" అని కూల్‌గా చెప్పాడు.

దీంతో ఆవేశంగా కావ్యాను ఉద్దేశించి దేవానంద్–

"రేయ్ ఇది నన్ను చీట్ చేసింది. తను మధ్యవర్తిగా వుండి... ఎవరో ఒకడికి డబ్బు ఇప్పించాననీ, వాడు ఇప్పుడు ఆ డబ్బు తిరిగి ఇవ్వడం లేదనీ, దాంతో డబ్బు ఇచ్చినవాడు తనని రోజూ టార్చర్ పెడుతున్నాడనీ... దాని వల్ల తనకి మనశ్శాంతి లేదని చెప్పింది."



"అందులో ఆమె నీకు చేసిన చీటింగ్ ఏంటీ?"

"నా కోరిక తీరిస్తే ఆ డబ్బు ఇస్తానని చెప్పాను. తను సరే అంది. తర్వాత తనకి మూడు లక్షలు ఇచ్చాను." అని వాపోయాడు.

"రేయ్! చీటర్ ఆవిడ కాదు...నువ్వు! తను ఒక ప్రాస్టిట్యూట్ అని నేను చెప్పే వరకు నీకు తెలీదు. మరలాంటప్పుడు నువ్వు నీ బెస్ట్ ఫ్రెండ్ భార్య పొందుకావాలని కోరుకోవడం ఎంత వరకు కరెక్ట్? మళ్ళీ సిగ్గు లేకుండా ఆవిడను నిందిస్తున్నావ్!" అని వెళ్ళబోతూ ఆగి...

"రేయ్! నువ్వు ఇలాంటి వాడివి అని తెలిసాక రేపు ఎప్పుడైనా నా భార్యతో నేను నిన్ను నమ్మి నీ ఇంటికి ధైర్యంగా రాగలనా?... చెప్పురా!" అని అన్నాడు కార్తీక్.

దేవానంద్ సిగ్గుతో... మొహం దించుకున్నాడు.

"అనుకోకుండా ఆవేశంలో నీ నీచపు బుద్ధిని బయట పెట్టేసుకున్నావ్... నీలాంటి దుర్మార్గుడితో స్నేహం చాలా ప్రమాదం... అందుకే అన్నారు... వందమంది శత్రువులకన్నా నమ్మకద్రోహం చేసే మిత్రుడే ప్రమాదకరం అని!" అన్నాడు కార్తీక్.

సైలెంట్‌గా ఉండడంతో వంచిన తల ఎత్తి చూశాడు దయానంద్.

అక్కడ కార్తీక్ లేదు.

ఇంతలో దేవానంద్ ఫోన్ రింగ్ అయింది.

ఫోన్ చేస్తున్నది జయరాం.

లిఫ్ట్ చేసి మాట్లాడే ధైర్యం లేక ఏదో ఆలోచిస్తూ అలా ఉండిపోయాడు దేవానంద్.






# ఆవకాయ నిద్ర


'అవేరా'
7207289424.


"ఎప్పుడు తెమ్మన్న ఫైలు?... ఎప్పుడు తెస్తున్నావు?... రెండు గంటలకి నా టేబుల్ మీద ఉండాలని చెబితే, మూడు గంటలకి సబ్మిట్ చేయడంలో మీ ఉద్దేశం ఏంటి?" అగ్గిమీద గుగ్గిలమయ్యాడు రామారావు.

"మీరు చెప్పినట్లుగా, రెండు గంటలకి ఫైలు తెచ్చాను సార్! కానీ మీరు గుర్రు పెట్టి నిద్రపోతున్నారు...."



"ఆc! నిద్రపోయానా?... ఆc! పోతే పోయి ఉండొచ్చు. ఉదయం పని ఒత్తిడి వల్ల కాసేపు కన్నుమలిగి ఉండొచ్చు... లేపి ఫైల్ ఇవ్వచ్చుగా?"

"అలాగే అనుకున్నానండీ! కానీ, 'రాత్రి నిద్ర తక్కువైందేమో'... అప్పటి అలసట ఇప్పుడు తీర్చుకుంటున్నారనుకుని, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకులే అని లేపలేదు."

"సమయానికి ఫైల్ పంపనందుకు, రీజినల్ మేనేజర్, ఎంతలా ఫైర్ అవుతున్నాడో ఏమో? ఐదునిముషాల్లో ఫైల్ చూసి చెప్తాను...వెంటనే రీజినల్ ఆఫీసుకి ఈమెయిల్ పంపించు."

"ఓకే సార్!" అని వెళ్ళిపోయాడు వర్మ.

మొబైల్ ఫోన్ వైబ్రేట్ అవుతుంటే చేతిలోకి తీసుకుని చూసాడు...రీజినల్ మేనేజర్ నుండి కాల్...'వామ్మో! అసలే సార్థకనామధేయుడు, ఏమంటాడో ఏమో?' అని భయపడుతూనే రిసీవ్ చేసుకున్నాడు.

"హలో సార్!... ఫైల్ ఐదునిముషాల్లో పంపించేస్తున్నాను! సారీ ఫర్ డిలే!" ఆయన అడక్కుండానే, సంజాయిషీ ఇచ్చుకున్నాడు రామారావు.

"నీకు నిర్లక్ష్యం బాగా ఎక్కువైంది. ఇప్పటివరకూ, నా పర్సనల్ నెంబర్ నుంచి, నీ కోసం 'ప్రేమలేఖ'... అదేనోయ్ 'మెమో' అంటాముగా... అది రెడీచేశా, రిప్లై ఇచ్చి చావు!" అని ఫోన్ కట్ చేశాడు రీజినల్ మేనేజర్ దుర్వాసన్.

మొబైల్‌లో చూస్తే, ఆ ఐదుకాల్స్, ఎర్రని గుర్తులో కని పిస్తూ వెక్కిరించాయి.

'ఛ! రాణీ ఫోన్ చేసి డిస్టర్బ్ చేస్తుందని, సైలెంట్‌లో పెట్టడం తప్పయింది.' అనుకుంటూ తలమీద మొట్టుకున్నాడు. యథావిధిగా రింగ్ టోన్‌లో పెట్టి, ఫైల్ చూసి ఓకే చేసి పంపించేసాడు.

మళ్ళీ మొబైల్ చేతిలోకి తీసుకొని ఒక నెంబర్ కాల్ చేసాడు– "హలో మేడం! రామారావుని..." రెండు నిముషాలు మాట్లాడి కాల్ కట్ చేసాడు.

మొబైల్ కూతకు అందుకుని చూసాడు, ఆన్సర్ చేసాడు.

"ఏవండీ... రాత్రి ఆలస్యమైనా, మీరు ఓపిగ్గా పెట్టిన ఆవకాయ పచ్చడి అదిరిందిట... కాకపోతే కొంచెం ఉప్పు పడుతుంది అన్నారు పక్కింటి పిన్నిగారు!" అంది రాణీ.

"అలాగా? థాంక్స్ చెప్పానని చెప్పు!"

"వెంటనే చెప్పేసాగా! చిన్న అబద్ధం కూడా చెప్పానండీ. పచ్చడి నేనే పెట్టానని..."

"ఆగాగు! ఫోన్ పెట్టేయకు..." అని విషయం చెప్పి, కాల్ కట్ చేసాడు.

మరుసటి రోజు ఆఫీస్‌కి వెళ్ళాడు. 'మెమో వచ్చిందా?' అని స్టాఫ్‌ని కనుక్కున్నాడు.

రాలేదు అని చెప్పాక, ముందు రోజు కాల్ చేసిన నెంబర్‌కి కాల్ చేసాడు– "హల్లో మేడం! థాంక్ యు!... నిన్న చెప్పినట్టుగా మీకు దాన్ని పంపించేసాను ఎంజాయ్!" అని కాల్ కట్ చేసాడు.

✦ ✦ ✦

"ఏంటోయ్! కొత్త ఆవకాయా? ఎక్కడిది? అద్భుతంగా ఉంది?" అన్నాడు దుర్వాసన్.

"కావలసిన వాళ్ళు పంపించారు... ఈ సంవత్సరం ఆవకాయ పెట్టేపని నాకు తప్పింది" అంది భార్యామణి.



## హాస్య బ్రహ్మలు

ప్రభాకర్ అంతోటి



### వేణుమాధవ్



**త**న తొలి చిత్రం 'సంప్రదాయం'లో... ఈట్లు, ఓడలు, పోరులు, లాట్లు, గులాబి, గులగులజాం అంటూ ఆయన ఇడ్లీలకు, వడలకు, పూరీలకు జిలూబీలకు, గులాబ్‌జామ్‌లకు సరికొత్త పేర్లను పెట్టి నవ్వించారు.

1969 సెప్టెంబర్ 28న కోదాడలో జన్మించిన ఆయన చిన్నప్పటినుండే డ్యాన్స్‌లు, మిమిక్రీలు చెయ్యడం మొదలు పెట్టారు. వెంట్రిలాక్విజంతో అన్నిచోట్లా ప్రదర్శనలు ఇచ్చేవారు. మిమిక్రీ ఆర్టిస్టుగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన అందులో ప్రావీణ్యం సంపాదించి మంచి పేరు పొందారు. హైదరాబాద్‌లో రవీంద్రభారతి, త్యాగరాయ గాన సభ వంటి పలు కళాక్షేత్రాల్లో ఆయన ప్రదర్శించే మిమిక్రీ ప్రదర్శనలు చూసి దర్శకుడు ఎస్.వి కృష్ణారెడ్డి 'సంప్రదాయం'లో తొలి అవకాశం ఇచ్చారు.

ఎన్.టి.ఆర్, చంద్రబాబు తదితర నాయకుల సభలలో వేణుమాధవ్ తన వెంట్రిలాక్విజం బొమ్మతో ప్రదర్శనలు ఇచ్చేవారు.

తొలి చిత్రం విడుదల కాగానే ఆయనకు వరుస అవకాశాలు వచ్చాయి. ఇక వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. ఆ తరువాత టిడిపి పార్టీ ప్రచారంలో పాల్గొనేవారు. అతని అభిరుచిని చూసిన ఎన్.టి.ఆర్ 'బొమ్మగారు' అని పిలవటం విశేషం.

'తొలిప్రేమ' సినిమాలో అమ్మాయిలపై వేణుమాధవ్ చెప్పిన డైలాగ్ ఆయన్ని ప్రేక్షకులకు చేరువ చేసింది. 'దిల్' చిత్రంలో వేణుమాధవ్ పోషించిన నితిన్ మామయ్య పాత్ర కూడా మంచి పేరు తెచ్చింది.

2006లో విడుదలైన 'లక్ష్మి' సినిమాతో ఉత్తమ హాస్యనటుడుగా నంది అవార్డును అందుకున్నారు. హంగామా సినిమాతో హీరోగా మారిన వేణుమాధవ్ 'ప్రేమాభిషేకం' చిత్రాన్ని రూపొందించారు.

పరిశ్రమకు వచ్చినప్పటినుంచి తన పుట్టినరోజును అనాథ శరణాలయంలోనే జరుపుకునేవారు. అక్కడ వారికి ఉపయోగపడే ఏదో ఒక పని చెయ్యడం చెప్పలేని సంతృప్తి అని ఆయన తెలిపేవారు.

అచ్చిరెడ్డి, కృష్ణారెడ్డిల చలవతో పరిశ్రమలోకి అడుగు పెటినందున తన ఇళ్లకు 'కృష్ణ నిలయం' అని పేరు పెట్టుకున్నారు.

దాదాపు 400 పైచిలుకు చిత్రాల్లో నటించిన ఆయన కాలేయ వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్‌లో కన్ను మూసారు. ఆయన లేని లోటు ఇప్పటికీ పరిశ్రమలో అలా మిగిలిపోయింది.




మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! 7

## కృష్ణ

కృష్ణ పేరుతో కార్టూన్లు వేసే వీరి పూర్తి పేరు కృష్ణ కిషోర్ వల్లూరి. స్వస్థలం రాయకుదురు. వీరు పుట్టింది, విద్యాభ్యాసం అంతా అమ్మమ్మ గారి ఊరు నరసాపురంలో (పశ్చిమ గోదావరి జిల్లా). టేలర్ హైస్కూల్, Y.N.కాలేజీలలో ఎమ్.కామ్ వరకు చదివారు. వీరి తల్లిదండ్రులు శ్రీమతి సూర్యకుమారి, శ్రీ శ్రీవత్సాంకర రావు. భార్య (శైలజ), ఇద్దరు పిల్లలు (అనిరుధ్,అనూహ్య).

గత 32 సంవత్సరాలుగా 'కృష్ణ' పేరుతో దాదాపు 9000 పై చిలుకు కార్టూన్స్ వేశారు.

కార్టూన్లు మాత్రమే కాక వెయ్యి వరకు కథలకు బొమ్మలు, పుస్తకాలకు కవర్ డిజైన్లు చేశారు. కృష్ణగారికి చిన్ననాటి నుండి ఆయన గురువు పెద్దనాన్నగారైన శ్రీబాపు (ప్రముఖ చిత్రకారులు, దర్శకులు) గారు వెన్ను తట్టి ప్రోత్సహించారు.


వీరి కార్టూన్లు ఇప్పటివరకు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో 5సార్లు, జాతీయ స్థాయిలో 15సార్లు, రాష్ట్ర స్థాయిలో 40సార్ల వరకు బహుమతులు గెలుచుకున్నాయి.


కృష్ణ హైద్రాబాదులో యానిమేషన్ రంగంలో ఉద్యోగం చేస్తూ ఎన్నో సినిమాలకి కూడా పనిచేశారు. చాలా కంపెనీలకి లోగోలు, ఫ్లైయర్స్ డిజైన్లు, స్టోరీ బోర్డులు చేశారు.


వీరికి బాగా పేరు తెచ్చిన 'చింటూ కామిక్స్' 200 వారాలుగా ఆంధ్ర భూమి దిన పత్రికలో వచ్చాయి. అలాగే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్‌కి సంబంధించి హైదరాబాద్ చరిత్రని 'నిజ్ కామిక్స్' రూపంలో సుమారు 80 వారాలు 4 భాషలలో చిత్రించారు.


తన విద్యని కొత్త తరానికి నేర్పాలన్న ఉద్దేశ్యంతో వీకెండ్స్‌లో పిల్లలకి డ్రాయింగ్, కార్టూన్లు నేర్పుతున్నారు. బొమ్మలు ఎలావెయ్యాలి అని చెబుతూ 'VALLURI KREATIVES' అనే యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నారు.


శ్రీకృష్ణగారు మరిన్నీ నవ్వించే కార్టూన్లతో పాఠకులను అలరిస్తూ, ఇంకెన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకోవాలని హాస్యానందం మనసారా కోరుకుంటోంది.

















ఈ పాపిని నూనెలో వేగించండి..
నేనసలే హార్ట్ పేషెంట్‌ని...కొస్త 'సన్ ఫ్లవర్' నూనె వాడమని చెప్పండి స్వామి..!!
నరకం
Krishna



డబ్బు
మనిషి
Krishna



ఈ రోజు మా దినం..
పూజ చేయండి పంతులు గారూ..!!
?
ప్రేమికుల దినం
Krishna


అక్షరాభ్యాస ముహూర్తం ఆసన్నమైంది..
పిల్లాడి చేత అక్షరాలు నొక్కించండి..!!
Krishna


ఈడెవడో
చైన్ స్నాచింగ్‌కి
కొత్తనుకుంట..
Krishna


ఈ లోకంలో కూడా ఇంత మోసమా..
అక్కడ రాసిందేంటి మీరు చేస్తుందేంటి..!!
నరకం
Krishna


డబ్బులిచ్చుకోలేం..కొస్త నీరు
పోయండి సారూ..దాహంతో
చచ్చిపోయేలా ఉన్నాం..!!
వాటర్ బాటిల్స్
20/-రూ॥
మాత్రమే
Krishna


మనిద్దరికీ వంట రాదు కదా..అందుకే
ఈ ఇల్లు అద్దెకి తీసుకున్నా శిరీ..!!
కర్రీ పాయింట్
Krishna

# తెలుగుకి తెగులు



నారంశెట్టి ఉమామహేశ్వరరావు
9490799203

'వెళ్ళు... ఆ మూలకి వెళ్లి గోడ కుర్చీ వేయ్!" గట్టిగా అరిచాడు కమిషనర్ శాస్త్రి.

'ఇక్కడ గోడకుర్చీ వెయ్యాలా?" ఆశ్చర్య పోయాడు బాలాజీ.

"ఏం? తప్పు చేసినప్పుడు మీ మాష్టారు చిన్నప్పుడు వేయించలేదా?" ఉరిమి చూసాడు అప్పన్న శాస్త్రి.

"అవుననుకోండి... అది చిన్నప్పుడు! కానీ ఇప్పుడు నేను ఉద్యోగంలో ఉన్నాను కదా! బాగుండదేమో..." చేతులు నులుపుకుంటూ చెప్పాడు బాలాజీ.

"అప్పుడు చిన్నవాడివి కదా అని వదిలేశారా? లేదు కదా? అప్పుడు నీకు చదువు బాగా రావాలని పనిష్మెంట్ ఇచ్చారు. ఇప్పుడు ఉద్యోగంలో ఉండీ నెల జీతం తీసుకుంటున్నావు. మరింకెంత పనిష్మెంట్ ఇవ్వాలి? ఆయ్ఁ!" మరింత గట్టిగా అరిచాడు శాస్త్రి.

"తప్పదంటారా?..." నెమ్మదిగా నోరు పెగల్చుకుని అడిగాడు బాలాజీ.


"ఎస్! నా మాటంటే మాటే..." టేబుల్ మీదున్న రూలర్ కర్రని మీదకి విసిరాడు శాస్త్రి.

అది తగలకుండా పక్కకి తప్పుకున్నాడు బాలాజీ.

అయినా ఫట్ మన్న శబ్దం... దాంతోనే నడుం కలుక్కుమన్న బాధ ఒక్కసారే కలిగాయి.

"అబ్బా!" గట్టిగా మూలిగాడు బాలాజీ.

"ఏమైందండీ? బాధతో మూలుగుతున్నారు.



నిద్రలో ఏదైనా పార్టు పట్టేసిందా? టైమ్ ఏడయింది. ఆదివారం కదా అని నిద్ర లేపలేదు. అప్పుడే లేవాలని లేదా?" చాముండి పిలుపు లాంటి అరుపుతో కళ్ళు తెరిచాడు బాలాజీ.

'ఏమిటీ?... ఇదంతా కలా?... వామ్మో!... నిజమనుకుని హడలి చచ్చాను. అదే నిజమైతే నా పరువు ఆఫీసు స్టాఫు ముందు మునిసిపాలిటీ కాలువలో కలిసిపోయేది. దేవుడా! నిజం కాకుండా చూడు!' ఆశ్చర్యం, మరో పక్క సంతోషం కలుగుతుండగా మనసులో అనుకున్నాడు బాలాజీ.

అతడికి సరిగా నిద్ర లేకుండా చేస్తున్నది... పీడ కలలు వచ్చినంతగా భయపడుతున్న పరిస్థితులు ఏమిటి? అవి ఎందుకు వచ్చాయన్న అనుమానం రావడం సహజం. అందుకే కథలోకి వెళ్దాం.

✦ ✦ ✦

## ఈ నెల 'దినం'



ప్రపంచ వినికిడి దినోత్సవం -మార్చి,3




బాలాజీ పేరు వింటే చాలు స్నేహితులంతా 'బాగా లేజీ' అనేవారు. బద్ధకం పోటీలు పెడితే వరుసగా ఒకటోది, రెండోది, మూడోది కూడా అతడికే వస్తాయి. క్లాసులో కూర్చోడంతో ఆగకుండా చదువులో కూడ వెనకే ఉండేవాడు. ఏ రోజూ క్లాసుకి టైముకి హాజరు కాలేదు. అది కూడా ఒక ప్రపంచ రికార్డు అయి ఉండేది ఎవరైనా రికార్డు చేసి ఉంటే !

అది కాకుండా... మరొక ప్రపంచ వింత కూడా అతడి ఖాతాలో జమ చెయ్యాలి. ఈ ప్రపంచంలో ఉన్న ఏడు వింతలో కాకుండా కొత్తవి ఎనిమిది, తొమ్మిది, పది చేరిస్తే వాటి మీద బాలాజీ పేరు రాయొచ్చు. తెలుగువాడై పుట్టి, తెలుగువాడై ఉండి, తెలుగు బాగా రాదు బాలాజీకి.

కొందరికేమో సైన్సు, మేథ్స్, ఇంకొందరికి ఇంగ్లీషులో మార్కులు తగ్గుతాయి. అది మనకు తెలుసు. మాతృభాషలో హీనంగా మార్కులు వచ్చినవాడిని బాలాజీనే చూస్తాము.


బాలాజీకి తెలుగంటే ఆసక్తి తక్కువ... ఎప్పుడూ బొటాబొటీ మార్కులు వచ్చేవి.

ఎనిమిదవ తరగతిలో బాలాజీ ఉన్నప్పుడు డిక్టేషన్ చెప్పారు తెలుగు మాస్టారు.

'మంచితనం' అని ఆయన చెబితే... 'ముంచేతనం' అని రాశాడు మనవాడు.

'ఔదార్యం' కి 'ఆదాయం', 'రావణ కాష్టం' కి 'రవాణా కష్టం', 'కృతజ్ఞత' కి 'క్రుతఘ్నత' అని కూడా రాసి ప్రత్యేకత, ప్రావీణ్యత చాటి చెప్పిన ఘనుడు మన బాలాజీ.

బాలాజీ చేతిలోని బుక్ అందుకుని చూసిన మాస్టారు చాలా సేపటివరకు తేరుకోలేని షాక్ తిన్నారు. అప్పుడే కాదు బాలాజి పదో తరగతి పూర్తి చేసి స్కూలు నుండి వెళ్ళేలోపు అలాంటి షాక్ లెన్నిసార్లు తిన్నారో లెక్క పెట్టలేము.




ప్లే చేసీ చేసీ అరిగిపోయిన సి.డి.లా తయారయింది మాస్టారు పరిస్థితి. చెప్పడంలో అలిసి, బోధపర్చడంలో సొలసి, మారక పోవడంతో విసిగిన మాస్టారు ఒకరోజు–

"ఒరేయ్ లేజీ బాలాజీ! నిన్ను బాగుచేయడం నా వల్ల కాదు. నీకు చిన్నప్పుడు విద్య నేర్పిన టీచర్లని అనాలి. అప్పుడు నిన్ను సరిగ్గా దారిలో పెట్టుంటే ఇప్పుడు తెలుగుని ఇంతగా ఖూనీ చేసేవాడివి కాదు. నిన్ను అని ఏం లాభం? మనిషికి జబ్బు చేస్తే మొదట్లోనే చూపించుకుంటే సులభంగా తగ్గుతుందంటారు. జబ్బు ముదిరితే తగ్గడమెంత కష్టమో నిన్ను బాగు చెయ్యాలనుకోవడం కూడా అంతే కష్టం! నీ ఖర్మానికి నిన్ను వదిలేస్తాను!... ఎలాగూ ఇంగ్లీషు మీడియం చదువులే కాబట్టి నువ్వెలా

తెలుగులో ఏడ్చినా నీకు ఢోకా ఉండదు. ఉద్యోగమో వ్యాపారమో ఏదో ఒకటి నిన్ను కన్న పాపానికి మీ నాన్న ఇప్పిస్తాడు. సర్దుకు పో" అని బాలాజీని వదిలేసారు.

బాలాజీ అదృష్టవంతుడనే చెప్పాలి.


చేతిరాత డాక్టర్ రాసినట్లు వంకర టింక రగా ఉంటుంది. డాక్టర్లు రాసింది కనీసం మెడికల్ షాపు వాళ్ళకయినా అర్థమవుతుంది. అది కొంత నయం. కానీ బాలాజి రాత వాడికి తప్ప ఎవరికీ అర్థం కాదు.

అంత ఘోరమైన దస్తూరి ఉన్నా బాలాజీకి నష్టమేమీ కలగలేదు. కారణం? సాక్షాత్తూ ఆ బ్రహ్మదేవుడు బాలాజీ నుదుటిమీద రాతని శ్రద్ధగా సన్మాన పత్రం రాయించి, అందంగా డి.టి.పి.చేయించినంత... అద్భుతంగా రాసాడు.

చేతిరాత బాగోకపోయినా నుదుటి రాత బాగోడం వల్ల తంతే స్విమ్ సూటులో ఉన్న తమన్నా ఒళ్లో పడ్డట్టు అదృష్టం కలిసొ చ్చింది అతడి బాబాయి రూపంలో.

బాలాజీ బాబాయి పేరు సంగమేశ్వరరావు. అతణ్ణి తెలిసిన వాళ్ళు 'సర్వం మేసేరావు' అని ముద్దుగా పిలుచుకునేవారు. అతడొక చిన్న సైజు గూండా. వీధిలో ఏ తగువు వచ్చినా సెటిల్ మెంట్లు చేస్తాడు. ఒకవేళ రాకపోయినా తగువు పుట్టించి కూడా సెటిల్ చేస్తాడు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసి బోర్డు తగి లించేసి చాలా ఆస్తులు పెంచుకున్నాడు.




'అది మా జాగా' అని... వచ్చిన వాళ్ళతో మజాగా మాట్లాడి... అందినంత దండుకుని స్థలం అప్పజెప్పేవాడు.

స్థలం అప్పజెప్పే ముందు మాత్రం–

"మీ జాగాని దర్జాగా వాడుకోండి. ఖాళీగా వదిలేస్తే కాజెయ్యాలనే బుద్ధి ఎవరికైనా పుడు తుంది నాలాగానే" అని నీతులు చెప్పి... పంపించేవాడు.

రాజకీయానికి దగ్గర దారేదో అన్వేషించాడు బాలాజీ బాబాయి.

సెల్లుఫోనుకీ సిమ్ముకార్డుకీ, ట్విట్టరుకీ సినీ తారకీ, పెరుగన్నానికి ఆవకాయకి ఉన్నంత రిలేషన్‌షిప్ ఉందని తొందరగా తెలుసుకుని... గూండాగిరీలో ప్రాక్టీస్ పెట్టాడు...

బాగా పాపులర్ అయ్యాక రాజకీయాల్లోకి గెంతి వైకుంఠపాళిలో వరుస నిచ్చెన లెక్కినట్టు త్వరగా పైకొచ్చాడు.

మునిసిపల్ ఎలక్షన్లలో చైర్మన్ పదవిని వీళ్ళ కులానికే రిజర్వు చేయడంతో 'సర్వం మేసే రావు' చైర్మన్ అయి కూర్చున్నాడు.

కూర్చున్నవాడు కొంతమంది మన నాయకు లను ఆదర్శంగా తీసుకుని కూర్చున్న చోటే కునుకుతుంటే పీడా విరగడయ్యేది. అలా కాకుండా మనీ ఇచ్చిన వాళ్ళకీ, గూండాగా ఉన్నప్పుడు కర్ర సాయం చేసిన వాళ్ళకి ప్లస్ తనకి కావలసిన వాళ్ళకి... పనులెన్నో చేసి పెట్టాడు.

బలాదూర్ తిరుగుళ్ళుతో బేజారెత్తిస్తున్న బాలాజీని కూడ తన వెనుక పెంపుడు కుక్క లాగా తిప్పుకున్నాడు.


అలా గానుగలో నువ్వుల పప్పులా, నోట్లో వక్కపొడిలా తిప్పీ తిప్పీ అదను చూసి, ఖాళీగా ఉన్న క్లర్కు ఉద్యోగంలో కూర్చుండబెట్టాడు.

కాలేజీ కుర్రాడికి ఫేస్‌బుక్ మీద రోజు రోజుకు ఇంట్రెస్ట్ పెరిగినట్టు... ఆఫీసులో అన్నింట్లో తానే అయి... అల్లుకుపోయాడు బాలాజీ.

అతడి బాబాయి పదవి నుండి దిగి పోయే లోపు పెర్మనెంట్ అవ్వడానికి ఏమేమి చేస్తే గ్యారంటీ ఉందో అవన్నీ చేసుకుపోయాడు.

తెలుగులోనే మన బాలాజీ జీరో...

కానీ వ్యవహార జ్ఞానంలో హీరో!



అతడి ప్రయత్నాలు పనికొచ్చాయి. అతడి బాబాయి గొప్పతనం కలిసొచ్చింది.

బుల్లితెర హీరో సినీ హీరో స్థాయికి ఎదిగి నట్టు... కొన్నాళ్ళకి పర్యవేక్షకుడు స్థాయికి ఎదిగాడు బాలాజీ.

వీధుల్లో పర్యటించి పరిశుభ్రత పరీక్షించే వాడతడు. శానిటరీ సూపర్ వైజర్ అన్నమాట.

అదృష్టం అతడి బాబాయి రూపంలో తిష్ట వేసుకుని కూర్చోక పోయుంటే బాలాజీకి ఈ పోస్టు సాధ్యం కాదంటారు అతణ్ణి తెలిసిన వాళ్ళు.


రోజులు ఇప్పటి హీరోల సినిమాల్లా డల్లుగా కాకుండా నటి సావిత్రి రోజుల్లోని సినిమా ల్లాగా స్పీడుగా పరిగెత్తాయి.

✦✦✦

ఆమధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జరిపిన ప్రపంచ తెలుగు మహాసభల పుణ్యమా అని గవర్నమెంటు ఆఫీసుల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు మాతృభాషలో జరపాలని ఆదేశించడంతోనూ, తెలుగులో స్పెషలైజేషన్ చేసిన అప్పన్నశాస్త్రి గారు అదే మునిసిపల్ ఆఫీసుకి కమీషనరుగా రావడంతోనూ బాలాజీకి కష్టాలు మొదల య్యాయి.

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చిత్తశుద్ధితో ఆచరణలో పెట్టాడు కమీషనరు.

తమ ఆఫీసులో రిపోర్టులన్నీ తెలుగులోనే రాయమని గట్టిగా చెప్పడంతో వైరస్ సోకిన కంప్యూటర్‌లా అయింది బాలాజీ పరిస్థితి.




ఎంకి పెళ్ళి సుబ్బిచావుకి రావడమంటే ఇదేనేమో అనుకున్నాడు.

"అక్కడెక్కడో తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు జరపడమేమిటి? అన్నీ తెలుగు లోనే రాయాలని ఆదేశించడమేమిటి? తాను పనిచేస్తున్న మునిసిపాలిటీకి తెలుగులో ప్రావీ ణ్యత ఉన్న శాస్త్రిగారు రావడమేమిటి? చిన్న ప్పుడు అలక్ష్యం చేసి వదిలేసిన తెలుగు... ఇప్పుడు పంటి కింద రాయిలా తగిలి బాధ పెట్టడమేమిటి?..."

బాలాజీ అంతరంగంలో 'మీలో ఎవరు కోటీశ్వరుడు' టైపులో... చాలా ప్రశ్నలు వచ్చాయి.

✦✦✦

వార్డుల్లో పర్యటించిన ప్రతిసారీ సమస్యలని రిపోర్టు రాసి కమీషనరుకి పంపడం బాలాజీ డ్యూటీ.

బేలన్సు లేక ఏడుస్తున్న వాడికి... మిస్సుడు కాల్ వచ్చినట్టు... జ్వరంతో మంచమెక్కితే కషాయం తాగించినట్లు అయింది బాలాజీ పరిస్థితి.

అంతంత మాత్రపు తెలుగు అని లోలోపల ఏడుస్తుంటే అంతర్గత రిపోర్టులన్నీ తెలుగులో ఇమ్మన్నాడు కమీషనర్.

ఇదీ బాలాజీ పీడకలకి కారణం!

గండం గడిచి గట్టెక్కితే తనకొచ్చిన ఒక్క రోజు బయటి ఆదాయం(జీతం కాదని మనవి. జీతం కంటే గీతం ఎక్కువని దేవుడు సంతోషి స్తాడని బాలాజీ విశ్వాసం) తిరుపతి హుండీలో వేస్తానని మొక్కుకున్నాడు కూడా.

బోరు బావిలో పడి గిలగిలా కొట్టుకుంటున్న పిల్లాడికి పైకి రావడానికి ఆధారం దొరికినట్టు, ఇన్‌బాక్సులో మెయిలు కోసం చూసి విసిగి పోయిన వాడికి... స్పామ్‌లో అదే మెయిలు ప్రత్యక్ష మయినట్లు ఫ్లాష్‌లాంటి ఆలోచన తట్టింది బాలాజీకి.

అంతే! ఇంద్ర సినిమాలోని 'దాయిదాయి దామ్మా! కులికే కుందనాల బొమ్మా!' పాటకి హీరో డ్యాన్సు చేసినట్టు కాసేపు మనసులోనే స్టెప్పు లేసాడు.

✦✦✦

పరిశుభ్రతా వారోత్సవాలు ప్రకటించడంతో



వార్డుల్లో తిరిగిన బాలాజీ మొత్తం సమస్యలు, పరిష్కార మార్గాలు సూచిస్తూ రిపోర్టు రాసాడు.

ఆ రిపోర్టు టేబుల్ మీదకి రాగానే చదివాడు కమీషనర్.

అదేమిటో అర్థం కాలేదతడికి. మరొకసారి కళ్ళద్దాలు సరిగ్గా పెట్టి చదివాడు.

ఒక్క ముక్క అర్థం కాలేదు.

ఈ సారి భంగిమ మార్చాడు.

కుర్చీలో వెనక్కు చేరబడి రెండు చేతులతో రిపోర్టుని తన కళ్ళ ముందు పెట్టుకొని చదివాడు.


అతి కష్టం మీద మొదటి పేరా పూర్తి చేశాడు.

అది తెలుగే అని తెలుస్తోంది కానీ అర్థం కావడం లేదు. కలయో వైష్ణవ మాయో అన్నట్టుంది ఆయన పరిస్థితి.

"పేదబొమ్మణ వీదిలో మరుగునీరు రాడ్ల మీదకు వస్తోంది. గంధినాగరులో ఉన్న పెద్ద వాళ్ళు ఇప్పటికే మురుగుదొడ్లు కుట్టలేదు. విధుల్లోనే మూల నిమజ్జనం చేస్తున్నారు. పిందులు విచ్చలవిడిగా తిరుగుతూ రాగాలు వెదజల్లుతున్నాయి. వాటివల్ల భోజనం పట్లు పడుతున్నారు. దోముల బెడాద కుడా ఎక్కువయింది."

ఆ పేరా తర్వాత ముందుకి కదలలేదు శాస్త్రిగారి చూపు.

కాలింగ్ బెల్ కొట్టి 'బాలాజీ గారిని రమ్మని' సహాయకుడిని పురమాయించారు శాస్త్రిగారు.




ట్రైనింగయిన కుక్క వాసన చూసి దొంగని కనిపెట్టినట్టు అటెండర్ రాకని పసిగట్టాడు బాలాజీ.

ఎందుకొచ్చాడో తెలీగానే ఆపిల్‌ఫోను గిఫ్ట్ వచ్చినప్పుడు కుర్రాడి ముఖంలో కనబడ్డ నవ్వు లాగా నవ్వు తన్నుకొచ్చింది.

ముప్పై కేజీల బొజ్జని లోపలకి నొక్కేసి... బెల్టుతో బిగించేసినట్లు సంతోషంతో కూడిన నవ్వుని లోపలకి తొక్కేసాడు బాలాజి.

ఏం జరగనట్లే ముఖం పెట్టి కమీషనర్ చాంబర్‌కి వెళ్ళాడు.

'నేను రాసినదాన్ని మహా మహా తెలుగు పండితులే చదివినా అర్థం చేసుకోలేరని... దీంతో నిర్ధారణ అయిపోయింది' గర్వంగా అనుకున్నాడు మనసులో.

"బాలాజీగారూ! మీ రిపోర్టు చదివాను... సారీ.. చూసాను. మీకు తప్ప మరెవరికీ అర్థం కాకూడదని శపథం పట్టారా? మిమ్మల్ని తీసుకెళ్లి ఇంటెలిజెన్సు విభాగానికి అధ్యక్షుడిగానో, సీక్రెట్ ఏజెన్సీకి కార్యదర్శిగానో నియమిస్తే బాగుణ్ణు. దేశ రహస్యాలు డీకోడ్ చెయ్యడం శత్రువులకు కుదిరేది కాదు... తెలుగులో పీ.జీ. చేసాను... యూనివర్సిటీ టాపరుని... మీరు రాసింది కొరుకుడు పడలేదు. మీరు చాలా గ్రేట్". ఇవి కాక లోలోపల ఏమనుకున్నారో మనకనవసరం కానీ బయటికి మరొక భావం కనబడకుండా చెప్పారు శాస్త్రి గారు.

బాలాజీ ఛాతీ రెండంగుళాలు పెరిగింది.

బయటకు కనబడకుండా జాగ్రత్త పడ్డాడు.

"అదంతా మీ అభిమానం సార్! థాంక్యూ సర్!... ఎందుకు పిలిచారో చెబుతారా?..." అన్నాడు వినయంలో నక్కని మించిపోయే రేంజులో.

'మీ రిపోర్టు ఒకసారి చదువుతారా?' అడిగారు శాస్త్రిగారు.

బయటకి చదివాడు బాలాజీ.

"పెద బ్రాహ్మణ వీధిలో మురుగు నీరు రోడ్ల మీదకు వస్తోంది. గాంధీనగరులో ఉన్న పేద వాళ్ళు ఇప్పటికీ మరుగుదొడ్లు కట్టలేదు. వీధుల్లోనే మలవిసర్జన చేస్తున్నారు... అందువల్ల పందులు విచ్చలవిడిగా తిరుగుతూ రోగాలు వెదజల్లుతున్నాయి. వాటివల్ల జనం పాట్లు



పడుతున్నారు. దోమల బెడద కూడ ఎక్కువ యింది…"

"అక్కడితో ఆపండి!" అంతవరకూ శ్రద్ధగా విన్న కమీషనరు చెప్పడంతో చదవడం ఆపి తలెత్తి చూశాడు బాలాజీ.

'ఒక్క పేరా రాయడానికి ఇన్ని తప్పులొచ్చాయా? తెలుగుదేశంలో పుట్టి తెలుగువారై ఉండి తెలుగులో ఇన్ని తప్పులా?… మీరు తెలుగులో రిపోర్టు రాయకపోయినా బాధ పడను కానీ తెలుగుని ఇంతలా ఖూనీ చేస్తే మాత్రం సహించను. మరెప్పుడూ తెలుగులో రాసిన రిపోర్టు నాకు చూపించొద్దు. ఇంగ్లీషులో రాయండి' కోపంతో పెద్దగా అరిచారు.

శాస్త్రిగారి ముఖంలో అంత కోపాన్ని ఎప్పుడూ చూడలేదు బాలాజీ. ఆ టైములో మాత్రం ఆయన కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి. ముక్కుపుటాలదిరాయి.

శాంతానికి మారు పేరయిన శాస్త్రి గారిలో ఇంత కోపమా? మరొక్క క్షణం అక్కడ ఉండడానికి భయపడ్డాడు బాలాజీ.

"అలాగే సార్!" ఫైల్ అందుకొని పరుగులాంటి నడకతో బయటపడ్డాడు.

తెలుగులో రిపోర్టు ఇచ్చిన ప్రతిసారీ కమీషనర్ ముందు నిలబడి చివాట్లు తినే బదులు ఒక్కసారికి గట్టిగా చివాట్లు తినైనా సరే… తెలుగులో రాయొద్దని అనిపించుకోవాలన్నదే బాలాజీ ఆలోచన.

ఆ విషయంలో సక్సెస్ అయ్యాడు.

తనకొచ్చిన తెలుగుకి భాషాదోషాలు వస్తాయని శాస్త్రిగారికి చెప్పడానికే మరిన్ని ఎక్కువ తప్పులు రాసి రిపోర్టు ఇచ్చాడు.


ఆయన నోటి నుండి… ఏమి రావాలనుకున్నాడో అదే విన్నాడు.

దటీజ్ బాలాజీ.

ఇలాంటి బాలాజీలు ప్రతి ఆఫీసులోనూ ఉంటారు. తెలుగుని అధికార భాషగా అభివృద్ధి చెయ్యాలని చూడకుండా… తెలుగు వాడకం మానేద్దామని ఆలోచిస్తూ ఉంటారు. అలాంటి వాళ్ళు ఉన్నంత వరకూ తెలుగుకి తెగులు పడుతూనే ఉంటుంది. తెలుగుని రక్షించేవాళ్ళు, అభివృద్ధి చేసే వాళ్ళు రావాలని కోరుదాం.


# చిలిపి చిలుకలు

మురళీధర్










# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం** మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.

## ఈ నెల అంశం- కాలం




















నో-నో-సారూ! కాలమ్ మారింది. ఈ ఫిగర్ ఇక్కడెయ్యాలి!!
Sridhar


బాడ్ టైమ్ నడుస్తుందని రెండ్రోజుల నుండి ఎటూ వెళ్లకుండా ఇంట్లోనే కూర్చుంటున్నారొదినా.. పొద్దునే పాత గోడగడియారం నెత్తిమీద పడింది


ఎవ్రుడమ్మా వీడు! గతం లోనుంచి వచ్చాడంట, నీతో కలిసి భవిష్యత్తు లోకి వెళతాడంట, ఎక్కడ దొరికాడే వీడు!
ఫేస్ బుక్కులో నాన్నా!
TIME MACHINE
Mani


పెద్దాఫీసరువి ఇక్కడికి ఎలా వచ్చేవు?
మంత్రిగారు ఒత్తిడి చేస్తే టైమ్ బాగులేక ఓ ఫైల్ మీద సంతకం చేశాను.
జైలు
Omkar.


HOLIDAYS - TIME TABLE
06.00 am - 08.30 am : playing video games
08.30 am - 09.00 am : Tiffen time
09.00 am- 01.00 pm : face book
01.00 pm - 03.00 pm : twitter
03.00 pm - 06.00 pm : playing video games
06.00 pm - 06.15 am : Tea time
06.15 pm - 11.00 pm : face book
సి.ఆర్.రాజు
బయటి ఆటలకు స్వస్తి...
కంప్యూటర్‌తో కుస్తీ...


ఇంకాస్త టైం పట్టేట్టుంది సార్! గ్లాసులు ఖాళీ అయ్యేదాకా ఆగమంటున్నారు!!
బీవీయస్


నీ కాడ 'పని' నేర్చుకున్న బుడ్డోల్లు కూడా "పెద్దోల్లై"పోయి... గద్దె లెక్కుతాంటే... నువ్వేంది మావా.. ఈడ్నే ఉండావ్..!?
టైం.. టైం" రావాలే.. బాబూ... టైం..!!
అనునేను...


దివ్యదృష్టి
వీడియో కాల్

# వామ్మో! ఓరి నాయనోయ్

నల్లబాటి రాఘవేంద్రరావు
9966212386



**ఈశ్వరయ్య కాలనీలో ప్రతి నెల ఆ కాలని అధ్యక్షులు, సంఘ పెద్దల ఆధ్వర్యంలో భార్యాభర్తలతో సకలజన సమావేశాలు జరుగుతుంటాయి.**

**మొత్తం ఆ కాలనీలో అన్ని అపార్టుమెంటులు కలిపి ఐదు వందల కుటుంబాలు ఉంటాయి. ఆ నెలలో జరిగిన గుస గుసలు, గసగసాలు,లవంగాలు... వగైరా వగైరా మొత్తం టాపిక్స్ అన్ని మాట్లాడేసుకుంటుంటారు ఆ సమావేశంలో.**

ఒక్కో నెల, ఒక్కో టాపికును రైజ్ చేసి... దాని మీద చర్చ పెట్టి తద్వారా... ఆ పాయింట్‌లో మంచి చెడ్డలను సమీక్షించి... ఒకవేళ చెడ్డ ఉన్నట్టయితే పెద్దలు అందరూ సమస్య సామరస్య పూర్వకంగా ఉండేటట్టు కొన్ని సూచనలు చెప్పి అవి పుస్తకంలో ఫైల్ చేస్తూ ఉంటారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే ప్రవర్తనలు తదనుగుణంగా సక్రమంగా మార్చుకోవాలి. ఎవరైనా తేడా చేస్తే పదివేల రూపాయలు ఫైన్!

మిగిలిన మొత్తం... భార్యాభర్తల జంటల ఎదురుగా ఈ తప్పు చేసిన భర్తకు కానీ భార్యకు కానీ వార్నింగ్...అవమానం!

దాంతో తలకాయ తీసుకెళ్లి భర్తలు ప్యాంటు జేబులో, భార్యలు హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకోవాలి అన్నంత ఘోర అవమానం... సరే ఆ స్థితి భరించలేక ఎవరికి వారే సెట్ అయిపోతుం టారు. అదీ ఈశ్వరయ్య కాలనీ సిస్టం.

అంతా బాగానే ఉంది...

ఈ నెల టాపిక్కు ఏమిటి అంటే...

'భార్యల వల్ల..భర్తలు పడే కష్టాలు!'

అధ్యక్షులవారు తమ పీఠం మీద కూర్చొని ఈ మధ్యనే ట్రిమ్ము చేయించుకున్న మీసం సవరించుకుంటూ పాయింట్ రైజ్ చేశారు.

అలా భార్యల వల్ల బాధలు పడే భర్తలు ఎందరు ఉన్నా చేతుల పైకెత్తమన్నారు.

గంట... రెండుగంటలు... అబ్బే... అబ్బేబ్బే... ఎవరూ చేతులు పైకి ఎత్తడం లేదు.

రెండు చేతులకు సంకెళ్లు పడిపోయినట్టు కదపలేని స్థితిలోకి వెళ్లిపోయారు.

కొందరయితే మనకు ఎందుకురా బాబు ఈ లేనిపోని గొడవ అన్నట్టు మూతికి అడ్డంగా ఎడమ చేతిని పెట్టుకుని ఆ భవనం సీలింగ్‌కి ఉన్న పెచ్చులు ఎన్ని ఊడిపోయాయో లెక్క పెట్టడం మొదలు పెట్టారు.

ఇద్దరు మాత్రం ధైర్యంగా తమ చేయి పైకెత్తి వెనక్కి తిరిగి చూసి ఇంకెవరూ చేతులు పైకి ఎత్తలేదు అని తెలుసుకుని... తోక ముడి చేశారు. ఆ ఎత్తిన చేయి సైలెంట్‌గా క్రిందకు దింపేశారు.

అంతేనా సంకలో గోక్కుంటున్నట్టు నటించి సభను రక్తి కట్టించారు.వాళ్ళ ముఖాలు కూడా రక్తి కట్టించుకున్నారు.

అక్కడితో అధ్యక్షుల వారితో సహా సంఘ పెద్దలందరూ మాట్లాడుకొని ఆ పాయింటు డ్రాప్ చేసేశారు.

సమావేశంలో సమయం ఇంకా ఉండడం తో మరోపాయింటు రైజ్ చేయవలసి వచ్చింది. సభను నడిపిస్తున్న పెద్దలకు.

ఈసారి పాయింటు...

'భర్తల వల్ల భార్యలు పడే కష్టాలు!'


ఈ రివర్స్ దెబ్బకు అక్కడున్న ఐదు వందల మంది భర్తలు తమ సీట్లు కొంచెం షేక్ ఇచ్చిన అనుభూతికి లోనయ్యారు.

ఓ అరడజను మంది భార్యలు పైకి లేచి.. టైటిల్ ఇంకా పవర్ఫుల్‌గా సెట్టింగ్ చేయ మన్నారు.

సంఘ పెద్దలు అందరూ సమాలోచనలో పడ్డారు.

ఒక నెలలో కుక్కలను పెంచుకునే ఇంటి ఓనర్ల సమస్య...

మరోనెలలో కాలనీలో జరిగే పెళ్లిళ్లకు అందరి తరపున ఒక్కరే వెళ్లి ఫుల్లుగా భోజనం చేసి వచ్చే విషయంలో తర్జనభర్జనల సమస్య...



ఇంకో నెలలో ఏ విషయంలోనైనా బయట వాళ్ళు వచ్చి గొడవ పెడితే ఆడవారు మాత్రమే కర్ర పట్టుకు వెళ్లి వాళ్లను తరిమి బుద్ధి చెప్పే విషయం మీద చర్చ...

ఇలా చాలా జరిగాయి కానీ ఈ విధంగా సమస్య టైటిల్‌నే పవర్ ఫుల్‌గా సెట్టింగ్ చేయమని అడగడం ఇదే ప్రథమం. పదిమంది పెద్దలు గుండ్రంగా కూర్చుని తమ గుండె కాయను గట్టిగా కుడి చేతితో పట్టుకొని ఎడమ చేతితో బట్ట తలలు తడుముకుంటూ సమస్య టైటిల్ పగడ్బందీగా మార్చారు. అది ఏంటంటే...

'మొండి శిఖండి భర్తల వల్ల అమాయకపు భార్యలు పడే... శతకోటి దరిద్ర కష్టాలు'.. అంటూ టైటిల్ మార్చారు..

దాంతో అక్కడున్న భార్యామణులు అందరికీ ఆ టైటిల్ మహా ఘోరంగా నచ్చేసి సంతోషించారు.

ఈసారి మళ్లీ సభ ప్రారంభం అయింది. సభ అధ్యక్షుల వారు...

"అలా అష్టకష్టాలు పడుతున్న భార్యలు అందరూ చేతులు పైకి ఎత్తండి!" అన్నారు.

ఈసారి ఒక్క భార్యగారు కూడా చేయి పైకి ఎత్తలేదు.

'హమ్మయ్య' అనుకున్నారు భర్తలు. తమ పరువు పిండాకూడు కాక పోయినందుకు చాలా ఆనందించారు.

తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు దారిలో తమ భార్యలకు కేజీ లడ్డు ఉండలు, నాలుగు మూరల మల్లె పూలదండ కొనాలని ఎవరికి వాళ్లే మనసులో ఫిక్స్ అయిపోయారు. కొందరు జున్ను కొనాలని ఇంకొందరు తాటి తాండ్ర కొనాలని, మరికొందరు కరకర లాడే చెకోడీలు కొనాలని తమ హృదయ



అంతర్భాగాలలో గట్టిగా నిశ్చయం చేసుకున్నారు.

ఇంతలో భార్యల గ్రూపు స్థానంలో ఉన్న ఓ నారీమణి పైకి లేచి–'ఒక్కో భార్యది ఒక్కో కష్టం! సమస్యను హోలు మొత్తంగా కాకుండా పర్సంటేజీ ప్రకారం అడగండి!" అంది.

అర్థమైన అధ్యక్షులవారు–

"సరేనమ్మ! సరే సరే తల్లి... అడుగుతున్నాను... వినండి– ఓ మాదిరిగా అంటే యాభైపాళ్ళు నరకయాతనలతో భర్తలవల్ల బాధలు పడుతున్న భార్యలు చేతులు పైకి ఎత్తండి..." అంటూ గట్టిగా అరిచారు.

అసలు ఒక్క భార్యామణి కూడా చేయి పైకి ఎత్తలేదు.

"ఈసారి ఇంకొంచెం పెరసెంటేజీ మార్చుతున్నాను... వినండి బంగారు తల్లులు... 75పాళ్ళు నరకయాతనలతో భర్తలు వల్ల బాధలు పడుతున్న భార్యలు చేతులు పైకి ఎత్తండి..." అంటూ గట్టిగా అరిచారు అధ్యక్షులవారు.

ఇప్పుడు కూడా ఒక్క భార్యామణి కూడా చేయి పైకి ఎత్తలేదు.

అధ్యక్షులు వారికి కోపం నషాళానికి దాటిపోయింది.

"అంటే మీ ఉద్దేశం... నూటికి నూరుపాళ్లు భర్తల వల్ల మీరు భయంకర అష్టకష్టాలు అనుభవిస్తున్నారని సభ్య సమాజానికి మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నారా? అలాగైతే ఇప్పుడు చేయి పైకి ఎత్తండమ్మ! సంతోషంగా పైకి ఎత్తండి. మీ కసి తీర్చుకునే అంత పరమానందంగా ఓ భార్యామణులు... మీ చేతులు పైకి ఎత్తండి. ఇదిగో! గట్టిగా అన్ని ఖండాలలో వినపడేటంత గట్టిగా లౌడ్‌స్పీకర్‌లో చెప్తున్నాను. నూటికి నూరుపాళ్ళు భర్తల వల్ల అష్టకష్టాలు అనుభవించేవాళ్ళు చెయ్యి పైకెత్తండి!... మహా రాణులు!!" అన్నారు అధ్యక్షులవారు.

నో!... కొంచెం కూడా ఎవరూ తల పైకి ఎత్త లేదు ఆ సమావేశంలో ఉన్న భార్యలు.

అధ్యక్షుల వారికి అన్ని అవయవాలు మండిపోతున్నాయి. తరువాత ఏ పర్సంటేజీ పెట్టాలో ఆయనకి అర్థం కాలేదు.

"ఇంకా చాలా పెర్సెంటేజీలు ఉన్నాయి కదా..." అరిచింది ఓ భార్యామణి.

"ఉంటాయమ్మా! ఎందుకు ఉండవు?... అంతా మీరాజ్యం అయి పోయింది. శతకోటి పర్సంటేజీలు ఉంటాయి. ఉండక చస్తాయా?... ఇదిగో అడుగుతున్నా! లక్షపాళ్లు అక్షరాల లక్ష పాళ్ళు తమ భర్తల వల్ల మహాభయంకరమైన అతి క్రూర రాక్షస పద్ధతిలో అష్టకష్టాలు కన్నా ఎక్కువ కష్టాలు పడుతున్న ఓ పరమ పవిత్ర భార్యామణులు... ఇలాంటి వాళ్లు ఈ సభలో ఎవరైనా ఉంటే తమ బంగారపు చేతిని దయచేసి పైకి ఎత్తండమ్మ తల్లి!..." అంటూ పొలికేక పెట్టారు అధ్యక్షులవారు.

ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్న అక్కడున్న 500 మంది భార్యామణులు ఒక్కసారిగా తమ చేతులు పైకి ఎత్తేశారు.

అంతేనా..."భర్తలు డౌన్ డౌన్!" అంటూ గట్టిగా అరిచారు...




ఆ కాలనీలో ఉన్న గృహాల పునాదులు కొంచెం అటు ఇటు కదలాడాయి ఆ దెబ్బకు.

ఆ అరుపులకు జడుసుకున్న భర్తలు భయపడి బెంబేలు పడిపోయి బయటకు పరిగెట్టేసారు... తోసుకుంటూ అక్కడున్న ఒకే ఒక్క ద్వారం గుండా.

భార్యలు కళ్ళు తెరచి చుట్టూ చూసే సరికి... ఆ భార్యల తాలూకు భర్తలు, అందరితో పాటు అధ్యక్షులవారు, మిగిలిన సంఘ పెద్దలు కూడా భూతద్దం పెట్టి వెతికి చూద్దామన్నా ఎక్కడా కనిపించకుండా పోయారు ఆ చుట్టుపక్కల ఫర్లాంగు దూరంలో. మీకేమైనా కనిపిస్తే కాస్త కబురు పెట్టండి! ప్లీజ్!!

# ఎందుకలాగా?!

'అభిమన్యు'
9440204748



**ఎలక్షన్స్ నోటిఫికేషన్లు రిలీజ్ అయ్యాయి.**

**ఎలక్షన్లు బరిలో దిగాలి అనుకున్న అభ్యర్థులు కోలాహలంగా ఉన్నారు.**

పార్టీల నుంచి టికెట్ వచ్చినవాళ్ళు ఆనందంగా, సందడిగా ఉన్నారు.

సింహాచలం కూడా చాలా చాలా ఆనందంగా ఉన్నాడు. ఎందుకంటే తను నమ్ముకున్న పార్టీ ఆఫీసు నుండి టికెట్ వచ్చింది.

అంగబలంతో నామినేషన్ వేసాడు.

వెంకటాచలం కూడా నామినేషన్ వేసాడు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా.

సింహాచలం, వెంకటాచలం చిన్ననాటి మిత్రులు.

ఒకే ఊరిలో పుట్టి పెరిగారు. ఒకే స్కూల్‌లో చదివారు. పెద్దవారయ్యారు.

సింహాచలం రాజకీయాల వైపు తిరుగుతాడు. వెంకటాచలంకి రాజకీయాలు అంటే అంతగా ఇంట్రస్ట్ లేదు. కాని, మిత్రుడు సింహాచలంకి సలహాలు ఇస్తుంటాడు.

గత ఎలక్షన్లలో ఎమ్ఎల్ఏగా గెలిచిన సింహాచలం ప్రజలకిచ్చిన వాగ్దానాలు మరచి ఇష్టారీతిన ప్రవర్తించ సాగాడు. అతని నియోజకవర్గ ప్రజలు అతగాడి పిచ్చి పిచ్చి పనులకి తలలు పట్టుక్కూర్చున్నారు.

వెంకటాచలం తన మిత్రుడికి చాలా విధాలుగా చెప్పి చూసాడు.

అయినా సింహాచలంలో మార్పు రాలేదు.

వెంకటాచలంకి కోపంగా ఉంది.

అందుకే మిత్రుడికి వ్యతిరేకంగా ఎన్నికల బరిలోకి దిగాడు.

ఎన్నికలు దగ్గరపడ్డాయి.

అభ్యర్థులు వివిధ వాగ్దానాలు గుప్పిస్తున్నారు.

మైకులతో హోరెత్తిస్తున్నారు.

వాహనాలేసుకుని తెగ తిరుగుతున్నారు.

గడప గడపకి వెళ్ళి ఓట్లు అడుగుతున్నారు.

ఆ నియోజకవర్గంలో ప్రధాన పోటీ సింహాచలం, వెంకటాచలం మధ్యే.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

సింహాచలం సిట్టింగ్ ఎమ్ఎల్ఏనని తనే గెలుస్తానని ధీమాగా ఉన్నాడు.

ఆరోజు కౌంటింగ్ ప్రారంభమైంది.

సింహాచలం ధీమా ఎగిరిపోయింది. ఎందుకంటే రౌండ్ రౌండ్‌కీ సింహాచలం కన్నా వెంకటాచలం మెజారిటీ పెరుగుతుంది.

చిట్టచివరికి వెంకటాచలం గెలిచాడు.

సింహాచలం బొక్కబోర్లా పడ్డాడు.

సింహాచలం బుర్ర తిరిగిపోతోంది.


బి.పి. పెరిగిపోతోంది.

పార్టీ ఆఫీసు నుంచి తిట్లవర్షం.

ఎలక్షన్ల కాన్వాసింగ్‌లో వెంకటాచలం ఏం మాట్లాడాడో తెలుసుకుందామని వీడియోలు రప్పించి చూసాడు.

అందులో... "ప్రజలారా నన్ను నమ్మండి. గవర్నమెంట్ నుంచి మీకు రావల్సినవన్నీ సక్రమంగా అందేట్లు చూస్తాను. మీ కష్టాల్లో పాలుపంచుకుంటాను...మీ అభివృద్ధికి దోహదం చేస్తాను. అంతేకాదు... గుడులలో, దేవాలయాలలో దేవుణ్ణి ఉచితంగా దర్శించుకోవచ్చు... దానికి ఎటువంటి రుసుం మీరు చెల్లించనక్కరలేదు... ఆ సౌకర్యం నేను మీకు కల్పిస్తానని మాట ఇస్తున్నాను..."

అంతే...సింహాచలం పడిపోయాడు ధబ్బున.






## ఆమె తెలివికి ఎల్లల్లేవు

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ కాస్త గొంతు సవరించుకుని...

"పిల్లబాబు భార్య అరసుకుమారి, అతని భుజం పై చూపుడు వేలితో గోకుతూ మరీ గారం పోతూ... "ఏవండీ... మరీ... మరేమో ఉగాది పండగ వస్తోందీ... మరీ... నాకు ఓ పట్టుచీర కొంటే బావుంటుందండీ. పైగా ఈ పండక్కి మనింటికి, మాచవరం నుండీ మా అక్కా, బావలు కూడా వస్తున్నారు. ఆ రోజు కూడా పాత చీర కట్టుకుంటే బావుంటుందా చెప్పండి?... పైగా వాట్సప్ స్టేటస్‌లో పాత పట్టుచీరతో ఫోటో దిగి పెడితే ఏం బావుంటుంది?!..." అంటూ సాగదీస్తూ మరీ అడిగింది.

ఆమె మాటలు వింటూనే, భయంగా ఓ గుటక మింగి, గోకుతున్న ఆమె చూపుడు వేలిని పట్టుకుని...

"ఇదిగో సుక్కూ, మొన్న సంక్రాంతికేగా రెండు పట్టుచీరలు కొన్నాను. కనీసం మూడు నెలలు కాకుండానే... మళ్ళీ నా ఆర్థిక పరిస్థితిని అధఃపాతాళానికి తొక్కేయకు. నేను మళ్ళీ అంత డబ్బు పెట్టి పట్టుచీర కొనడం అసాధ్యమైన పని!" దీనంగా ఆమె వైపు చూస్తూ అన్నాడు.

దాంతో ఆమె మొహాన్ని గండుపిల్లిలా పెట్టి- "ఛ! ఏం మనిషండీ మీరు?... పెళ్ళానికి పండక్కి ఒక్క పట్టుచీర కొనడానికి ఇంత నలిగి పోతారా? అయినా తప్పు మీది కాదు నాది!... మా నాన్న మాట విని, ఆ బర్మా పెళ్ళి సంబంధం చేసుకునుంటే... నాకు ఈ ఖర్మ పట్టేది కాదు. అతనికి సొంత చీరల షాపు ఉంది. కానీ నేనే చదువుకున్నవాడు కావాలీ అని ఇలా ఒక్క చీర కోసం మీతో మాటలు పడుతున్నాను... అయినా... కొనాలనే మనసుండాలే కానీ, ఏదైనా సాధ్యమే!... ఎలా అయినా కొనొచ్చు!" అని... ఆమె చీర చెంగుతో కళ్ళు ఒత్తుకుంది.

ఆమె మాటలకి మరింత కోపం తెచ్చుకున్న పిల్లబాబు-

"ఏవిటీ? మనసుంటే సాధ్యమా?! నా బొందేం కాదూ..." అని వాళ్ళ మూడేళ్ళబ్బాయి బాబిగాడి వంక చూశాడు.

బాబీ, గాలిపోయిన పెద్ద ఫుట్‌బాలుతో ఆడుకుంటున్నాడు. ఏదో ఆలోచన తట్టినట్టు, ఆ బంతిని వాడిచేతుల్లోంచి తీసుకుని...

"మనసుంటే ఏదైనా సాధ్యం అన్నావ్ కదా! కనుక ఈ గాలిపోయిన బంతిని నీకు నచ్చిన వైపు విసురు, అది ఆ వైపుకి తగిలి... మళ్ళీ వేగంగా నీ చేతుల్లోకి రావాలి! అలా జరిగితే నీకు పట్టుచీర కొంటాను!" అన్నాడు వ్యంగ్యంగా.

దానికి ఆమె కొంచెం సేపు ఆలోచించి...

"సరే!" అని బంతిని తీసుకుని ఓ వైపు విసిరింది. అది ఆ వైపు తగిలి, మళ్ళీ వేగంగా ఆమె చేతుల్లోకి రావడంతో పిల్లబాబు తెల్ల మొహం పెట్టి... "నీ తెలివికి ఎల్లలేవు!... కొంటాను!"అన్నాడు.

సుకుమారి విజయగర్వంతో నవ్వింది.

ఇప్పుడు చెప్పు సుబ్బారావ్, గాలి పోయిన ఆ బంతిని సుకుమారి విసిరితే, అది మళ్ళీ ఆమె చేతుల్లోకి ఎలా వచ్చింది?" అడిగాడు తర్కారావ్.




"సింపుల్ సార్!... ఆ బంతికి తాడు కట్టి విసిరి వెనక్కి లాగుంటుంది. దాంతో విసిరిన వైపు నుండి తిరిగివచ్చి, ఆమె చేతుల్లో పడుంటుంది. అంతేనా సార్?" అడిగాడు సుబ్బారావ్ నమ్మకంగా.

"కాదు తమరి బొంద! ఆమె ఆ గాలిపోయిన బంతిని,పైకి సీలింగ్ వైపుకి విసిరింది. దాంతో అది సీలింగ్‌ని తాకి మళ్ళీ ఆమె చేతుల్లోకి వచ్చి పడింది.... దాంతో పిల్లబాబు ఆమెకి మరో చీర కొనిపెట్టాల్సి వచ్చింది. అదీ జరిగింది... నువ్వు కనీసం దగ్గరగా కూడా చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు!" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ... నా తరపు అర్థం చేసుకోరు కదా?" అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.




డా॥ డింగిరి
సైకియాట్రిస్ట్
DAYAKAR
మీ యొక్క మానసిక స్థితిని పరిశీలించాక తెలింది ఏంటంటే... మీకు 'అతి మొహమాటం' ఉందనీ!
ఎంత కాలంగా మీరీ సమస్యతో బాధ పడుతున్నారు?
సమాధానం చెప్పండి! ఎప్పట్నుంచి మీకీ సమస్య ఉంది?
మౌనంగా వుండకండి నా ప్రశ్నకు సమాధానం చెప్పండి?
ఎప్పట్నుంచి చెప్పండి?
ఎప్పట్నుంచి చెప్పరా చెప్పు .... నువ్వు ఏం చెప్పకపోతే నీకు ట్రీట్మెంట్ ఎలా చెయ్యాలిరా అడ్డగాడిద.....
DAYAKAR

# వింత సమస్యలు

పద్మ పైడిమర్రి
7675045608



**చిన్నప్పటి నుంచీ సుబ్బారావుకు తన పేరు అంటే అస్సలు ఇష్టముండేది కాదు. దానికో ముఖ్య కారణం కూడా వుంది. సుబ్బారావు అమ్మ పేరు రజని. నాన్న పేరు వినయ్. సుబ్బారావుకు తప్పనిసరి పరిస్థితులలో వాళ్ల తాత పేరు పెట్టవలసి వచ్చింది. మీకు అంత మంచి పేర్లు, నాకు ఏంటి ఈ పేరు?... అని ఎప్పుడూ సుబ్బారావు వాళ్ల అమ్మా, నాన్నలతో దెబ్బలాడుతూ వుండేవాడు.**

పోనీ ఆ పేరు అయినా సరిగ్గా పిలిచేవారా అంటే అదీ లేదు. సుబ్బిగా, సుబ్బడు, ఇలా రకరకాలుగా పిలిచేవారు. పేరు విషయంలో అసంతృప్తి అలానే వుండిపోయింది సుబ్బారావుకు.

తను పెళ్లి చేసుకునే అమ్మాయికి మంచి పేరు వుండాలని పట్టుబట్టాడు సుబ్బారావు. అమ్మాయి అందంగా వున్నా సరే, పేరు నచ్చకపోతే వద్దనేసేవాడు.

కొంతమంది అమ్మాయిలు, సుబ్బారావుని పేరు నచ్చక వొద్దనేవారు.

ఇలా చాలా రోజులు గడిచిపోయాయి.

ఈలోపు ఒకమంచి సంబంధం వచ్చింది, సుబ్బారావు తలరాత ఏమిటోగాని అమ్మాయి పేరు సుబ్బలక్ష్మి. చేసుకోనని ఎంత గొడవ చేసినా తాళి కట్టక తప్పలా.

సుబ్బారావు ఒక రోజు తన భార్యని–

"నీకు నీపేరు ఇష్టమేనా?" అని అడిగాడు.

"నాకు పేరు మాట ఎలావున్నా, ఎవరైనా పోలికలు గురించి మాట్లాడితే నచ్చదు. ఎందుకంటే ఎవరి పోలిక వాళ్ళదే. ఒకరిలా ఇంకొకరు వుండరుకదా!... బాగుంటే తమ వాళ్ల పోలికని, అదే నచ్చకపోతే అవతల వాళ్ల పోలిక అనేస్తారు. అందుకే నాకు ఎవరితోనూ పోల్చడం నచ్చదు!" అంది సుబ్బలక్ష్మి.

"భలే వుంది! నాకు నా పేరు ఇష్టం లేదు... నీకు పోలికల గురించి మాట్లాడితే...ఇష్టముండదు. సరిపోయింది ఇద్దరివీ వింత సమస్యలే!" అన్నాడు సుబ్బారావు

"సరేలెండి! మనం మన పిల్లలకు, మీకు నచ్చిన పేరు పెడదాం!" అంది సుబ్బలక్ష్మి.

అలాగే "నేను గూడా ఎప్పుడూ పోలికలు గురించి మాట్లాడను!" అన్నాడు సుబ్బారావు.

కొన్ని రోజులకు వాళ్లకు బాబు పుడతాడు.

ఆసుపత్రిలో వుండగానే సుబ్బలక్ష్మి తల్లి కమల పిల్లాడిని చూసి– "పిల్లాడు బాగున్నాడు గాని, నీ రంగు రాలేదే... మీ అత్తారింట్లో అందరూ కొంచం రంగు తక్కువే అదే పోలిక వచ్చింది. కాని ముక్కు మటుకు నీదేనే, చిలక ముక్కు, ఆ కళ్ళు అంటూ..." ఇంకా ఏదో మాట్లాడ బోతుంటే...

సుబ్బలక్ష్మి– "అమ్మా! ఇంక ఆపు, నాకు ఇలా మాట్లాడితే ఇష్టముండదని నీకు తెలుసుగా, అయినా మీ అల్లుడు ఇక్కడే వున్నారు!" వింటే బాగోదు అంటుంది.

ఇంతలో సుబ్బారావు, వాళ్ళఅమ్మ రజనీని తీసుకుని లోపలకు వచ్చాడు. కమల మాటలు వినడం గూడా జరిగింది.


అందుకే రజనీ వస్తూనే– "భలే బాగున్నాడు మా మనవడు! మీ అమ్మాయిలా మరీ తెల్లగా వుంటే మొహం పాలిపోయినట్టు వుండేది... ఇప్పుడు సరి అయిన రంగులో వున్నాడు!... మావాడి కళ్ళు చాలా పెద్దవి, కానీ వీడికి తల్లి పోలిక వచ్చినట్టు వుంది, కళ్ళు కాస్త చిన్నవిగా ఉన్నాయి!" అంటూ మాటకి మాట అంటించేసింది రజనీ.

సుబ్బలక్ష్మికి ఈ పోలికలు గొడవ ఇష్టముండదని తెలుసు కదా! అందుకే సుబ్బారావు ఎలాగో అలా అప్పటికి సర్దిచెప్పాడు.

అందరూ కలసి బాబుని తీసుకుని ఇంటికి వెళ్ళారు.

ఇంక పెట్టబోయే పేరు గురించి గొడవలు మొదలయ్యాయి.

సుబ్బారావు, నాకు జరిగిన అన్యాయం నా



కొడుక్కి జరగనివ్వను , పేరు విషయంలో ఎవరి మాటా వినను... నా కొడుకు పేరు నా ఇష్టం, అని కచ్చితంగా చెప్పేశాడు సుబ్బారావు.

సుబ్బారావుకి చిన్నప్పటినుంచి క్రికెట్ అంటే ప్రాణం. సుబ్బలక్ష్మి గూడా క్రికెట్ అభిమానే. సుబ్బారావుకి ధోనీ ఇష్టం, సుబ్బలక్ష్మికి కోహ్లీ ఇష్టం. అందుకే ఇద్దరూ మాట్లాడుకుని గొడవలేకుండా ధోహ్లీ అని పెట్టేశారు.

పెద్దలకు నచ్చక పోయినా ఏమీ చెయ్యలేక వూరుకున్నారు.

బారసాల హడావుడితో బాబు రాత్రి సరిగ్గా నిద్రపోలేదు అస్తమానం ఒకటే ఏడుపు.

ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు.

సుబ్బలక్ష్మి అత్తగారు పొద్దున్న లేస్తోనే, సణుగుడు మొదలు పెట్టింది, “మా వాడు ఇప్పటికీ గూడా పడుకున్నాడంటే చాలు పొద్దున్నదాకా లేవడు. వీడికి ఎవరి పోలిక వచ్చిందో... రాత్రి అంతా ఒకటే ఏడుపు. ఆ మధ్యన మీ తమ్ముడు వచ్చినప్పుడు చూసా... అస్తమానం నిద్రలో లేస్తూనే వున్నాడు, మేనమామ పోలిక అనుకుంటా!” అంది కోడలితో.

సుబ్బలక్ష్మికి వొళ్ళు మండిపోయింది.

“ఆ రోజు మా తమ్ముడు మీ ఇంట్లో దోమలు కుట్టి సరిగ్గా నిద్రపోలా, అంతే కానీ ఇప్పటికీ వాడు నిద్రలోలేచి ఏడుస్తాడు అన్నట్టు మాట్లాడు తారేంటి? ఐనా మేనమామ పోలిక వస్తే మంచిదే. మీ అబ్బాయిలా మొద్దు నిద్ర మంచిది కాదు!” అని కోపంగా లోపలకు వెళ్ళిపోయింది ఎంత వద్దనుకున్నా ఈ పోలికల గొడవ వదలడం లేదు అనుకుంటూ

ధోహ్లీకి అప్పుడప్పుడే మాటలు వస్తున్నాయి.

ఇంతలో ఒకరోజు కూతురిని చూడటానికి కమల వచ్చింది. మనవడిని ముద్దులాడుతూ...

“ఏంటే వీడికి కొన్ని అక్షరాలు పలకడంలేదు అంటుంది.”

“అమ్మా! వాడు ఇంకా చిన్నోడు! అవే వస్తాయి నిమ్మదిగా!” అంటుంది సుబ్బలక్ష్మి.

“సరేలే మీ పెళ్ళిలో చూసా... మీ ఆయన తరుపు చుట్టాల్లో ఎవరో



సరిగ్గా మాట్లాడలేక పోయారు ఆ పోలిక గాని వచ్చిందా?" అని నా బాధ అంటుంది.

అప్పుడే అటుగా వచ్చిన సుబ్బారావు ఈ మాటలు విని కోపంగా కొడుకుని తీసుకుని లోపలకు వెళ్ళిపోతాడు.

సుబ్బలక్ష్మి గూడా తల్లి మీద దెబ్బలాడుతుంది.

"ఏమ్మాటలమ్మా అవి అని!".

"అయ్యో ఏమన్నాననే నీకు అంత కోపం? అయినా నీకు అంతా మీ మేనత్తల పోలికేనే బాబు, పూరికే మూతి ముడుచు కుంటారు వాళ్ళు గూడా నీలాగే!" అంటుంది కమల కూతురిని.

"సరేలే ఎక్కడో ఉన్న వాళ్ళని గూడా లాగేస్తావ్ నువ్వు!" అని విసుగ్గా లోపలకు వెళ్ళి పోతుంది సుబ్బలక్ష్మి.

ఈ పోలికలు నన్ను వదిలి పెట్టడం లేదు... అని సుబ్బలక్ష్మి, సుబ్బారావు దగ్గర బాధపడుతుంది.

"మనం మాట్లాడక పోయినా... అందరినీ ఆపలేం కదా! నువ్వు పట్టించుకోకు!"అంటాడు సుబ్బారావు.

మరునాడు సుబ్బలక్ష్మి స్నేహితురాలు కాంచన వాళ్ల పాపని తీసుకుని స్నేహితురాలు దగ్గరకు వస్తుంది.

ఇద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకున్నాకా...

"ఎంటే ఏదో ఆలోచనలో వున్నావ్?... సమస్య ఏంటి?" అని అడిగింది కాంచన.

"నీకు తెలుసు కదే... నాకు ఎవరు పోలికలు గురించి మాట్లాడినా ఇష్టం ఉండదని, కానీ అదేంటే, అందరూ అదే మాట్లాడతారు." అంటుంది సుబ్బలక్ష్మి స్నేహితురాలితో.

కాంచన నవ్వుతూ– "మనం ఎవ్వరినీ మార్చలేము. ఎవరి అభిప్రాయం వాళ్ళు చెబుతారు అంతే! మా అన్నయ్యకి బుగ్గలకు సొట్టలు వున్నాయికదా! అవే నా కూతురికి వచ్చాయి. కానీ మా అత్తారింట్లో ఎవ్వరికీ లేవు!...అందుకని మా అత్తగారు 'ఏంటీ మొహం మీద గుంటల్లా' అంటారు. విని నవ్వి పూరు కోడమే! అందరినీ కట్టడి చెయ్యలేము కదా!... సరదాగా తీసుకో వడమే, మన పిల్లలకి పిల్లలు పుట్టేటప్పటికి మనం గూడా పేర్లు గురించి, పోలికలు గురించి, ఇలాగే మాట్లాడతామేమో?" అనే సరికి...

సుబ్బలక్ష్మి గూడా నవ్వుతో తలూపుతుంది... 'అంతేలే' అంటూ.

రోజులు చాలా తొందరగా పరుగు పెట్టేసాయి.

ధోహ్లీ పెద్దవాడు అయ్యాడు.


ఒకరోజు వాళ్ల నాన్న దగ్గరకు వచ్చి–


"ఏంటి నాన్న ఈ పేరు, అటు ధోనీ కాదు, ఇటు కోహ్లీ కాదు. నాకు నచ్చలా! హాయిగా సుబ్బారావు అని పెట్టచ్చుగా, అందరూ సుబ్బు అని పిలిచేవారు!" అంటాడు.


సుబ్బారావు, సుబ్బలక్ష్మి, మాటరాక వుండి పోయారు.

## హోలీ...రంగుల నవ్వులు

చక్రవర్తి




# పుస్తక ప్రదర్శనలో హాస్యానందాలు

దాస్




పుస్తక
ప్రదర్శనలో
నా అనుభవాలు




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె.

ఇందునాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలను కుంటుంటాడు. ఇందు, ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్టపడుతుంది. ఒక షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఇందు, చందు కలుస్తారు.... **ఇప్పుడు...**

**"ఆ రాఘవరావు, వజ్రాల నగ తీసుకురావడానికి, న్యూయార్క్‌కు వెళ్ళాడు. నగను తీసుకొచ్చిన తరవాత, దాన్ని పెట్టించాల్సిన ప్లేస్ మార్చాలి. సంజీవని మన చేతుల్లో ఉంది కాబట్టి, పోలీసులను తీసుకొచ్చే సాహసం చెయ్యరు! ...**

**కానీ, ఆ నగకు ఏదైనా మైక్రోఫోన్ లాంటిదో, జీపీఎస్ పరికరమో పెట్టే ప్రయత్నం చేస్తారు. సో... అలాంటివి ఉంటే, ముందు పీకి పారెయ్యాలి. తర్వాత నగను విమాన మార్గం గుండా కాకుండా రోడ్డు మార్గం ద్వారా ఎలాగైనా సరే కాలిఫోర్నియా తీసుకెళ్లాలి. అక్కడ నాకు తెలిసిన ఓ పెద్ద పార్టీ ఉంది. వాళ్ళు గుట్టుచప్పుడు కాకుండా ఈ నగను కొంటారు. కొంత డబ్బు ఇక్కడే, అమెరికాలో డాలర్స్‌లో బ్లాక్ మనీ రూపంలో సెటిల్ చేస్తారు. కొంత డబ్బు, స్విస్ బ్యాన్ ఖాతాలో సెటిల్ చేస్తారు. కొంత డబ్బు, భారతదేశంలో బ్లాక్ మనీ రూపంలో సెటిల్ చేస్తారు. ఇదంతా జరగడానికి ఒక వారం రోజులు పడుతుంది!"** చెప్పాడు సుబ్బు.

"ఒక వజ్రం నాకు ఇస్తా అన్నావ్ కదా?"

"ఆ నగ నుండి వజ్రాన్ని పీకి, డైరెక్ట్‌గా ఎలా ఇస్తాను? దాని విలువకు వచ్చే డబ్బును మీకిస్తాను," అన్నాడు సుబ్బు.

"ఓకే! రాఘవరావు వచ్చాక, ఏ ప్లేస్‌కు నగను తీసుకు రమ్మని చెప్పాలి?" అడిగాడు వీసాచారి.

"అది కూడా నేనే చెప్పాలా? ఇక మీరూ, మీ గ్యాంగు ఏం చేస్తున్నట్లు?" చిరాగ్గా అన్నాడు సుబ్బు.

"ఓకే! నేను చూసుకుంటానులే! మళ్ళీ మనం ఎప్పుడు, ఎక్కడ కలుస్తున్నాం?"

"నగ చేతిలో పడగానే, హ్యూస్టన్ నేచురల్ సైన్స్ మ్యూజియం ముందు కలుద్దాం! అక్కడి

నుండి కారులో కాలిఫోర్నియా వెళ్లిపోదాం." అన్నాడు సుబ్బు.

"కాలిఫోర్నియాలో ఏ నగరానికి?" అడిగాడు వీసాచారి.

"ఇప్పుడే చెప్పను... నగ చేతిలో పడిన తర్వాత చెప్తాను!"అన్నాడు సుబ్బు.

వీసాచారి తలూపి, పల్లీలు తింటూ వెళ్లిపోయాడు.

సుబ్బు తనలో తాను– 'ఈ వెధవకు ఓ వజ్రం కావాలట!... కిడ్నాపు చేయించి పెట్టినందుకు కాస్త కూలి పడేస్తాను. నగ చేతిలో పడ్డాక, అసలు నేను వెళ్లబోయేది కాలిఫోర్నియా రాష్ట్రం వైపు కాదురా వీసాచారి! నిన్ను ఎలా బురిడీ కొట్టిస్తానో చూద్దువుగానీ!' అనుకుంటూ, తనలో తాను నవ్వుకోసాగాడు సుబ్బు.

అయితే... ఇక్కడే వీసాచారిని తక్కువ అంచనా వేసాడు సుబ్బు.

వీసాచారి, మొదటి నుండి సుబ్బు వాలకం గమనిస్తూనే ఉన్నాడు. ఈ సుబ్బు, చేయించుకోవాల్సిన పనంతా చేయించుకొని, తెప్ప తగలబెట్టే రకమని వీసాచారికి ముందే అర్థం అయ్యింది. అందుకే తన జాగ్రత్తలో తాను ఉన్నాడు. తాను, సుబ్బు కలిసిన ప్రతిసారీ...ఆ సంభాషణను, సుబ్బుకు తెలియకుండా రికార్డ్ చేయసాగాడు. కాలిఫోర్నియాలో ఏ నగరానికి వెళ్ళాలో... సుబ్బు చెప్పకపోయేసరికి, వీసాచారికి అనుమానం బలపడింది.

'ఒరే సుబ్బు! నాకు హ్యాండిస్తావా!... నీ వెనకాలే నేను గొయ్యి ఎలా తవ్వు తున్నానో...



నీకు ఇంకా తెలియదురా! తెలిసాకా దిమ్మ తిరిగి బొమ్మ కనపడుతుంది!' అనుకున్నాడు వీసాచారి.

✦✦✦

హ్యూస్టన్ నగరంలోని ఓ మార్వాడీ నగల కొట్టు. అందులో భారీ కాయం ఉన్న మార్వాడీ ముందు కూర్చొని ఉన్నాడు సుబ్బు!

"చెప్పు సుబ్బు భాయ్! ఏం చెయ్యాలి?" అన్నాడు మార్వాడీ.

"అప్పట్లో...మీరు ఇండియాకు పంపాలి అనుకున్న డాలర్లను, మనీ ల్యాండరింగ్ ద్వారా ఇండియాలో నోట్ల రూపంలో అందచేసాను. నేను మీకు చేసిన సహాయం గుర్తుంది కదా?" అన్నాడు సుబ్బు.


"ష్! మెల్లిగా సుబ్బు భాయ్!... గుర్తుంది. మీకేం సహాయం కావాలో చెప్పండి!" అన్నాడు మార్వాడీ.

"నేను మీకు ఓ నగ ఫోటో చూపిస్తాను. రంగురాళ్ళతో సరిగ్గా అలాంటి గిల్ట్ నగ తయారు చేసి ఇవ్వాలి." అన్నాడు సుబ్బు.

"అది మా చేతుల్లో పని! ఏది... ఆ ఫోటో ఇవ్వండి!" అడిగాడు మార్వాడీ.

సుబ్బు, ఓ అమెరికన్ లైబ్రరీలోని జర్నల్‌లో పబ్లిష్ అయిన పాత డాక్యుమెంట్ ఫోటో కాపీ తీసి ఇచ్చాడు.

మార్వాడీ దాన్ని చూసి– "ఇదేదో, పురాతనమైన వజ్రాల నగలా ఉందే!" అన్నాడు.




"అవును! డూప్లికేట్ చేయగలరా?"

"తప్పకుండా భాయ్! ఎప్పుడు కావాలి?"

"రేపటిలోగా కావాలి!"


"10 రోజులు టైం ఇస్తే ఫ్రీగా చేసి ఇవ్వగలను. రేపటిలోగా అంటే, వేరే దుకాణాల నుండి పనివాళ్ళను ఎంగేజ్ చెయ్యాలి! కాస్త ఖర్చు ఔతుంది భాయ్!"

"నేను పెట్టుకుంటాను!" అన్నాడు సుబ్బు.

"అయితే రేపటికి అయిపోతుంది!"అన్నాడు మార్వాడీ!

సుబ్బు, నవ్వుకుంటూ...జాలీగా బయటకు వెళ్లిపోయాడు.

## సమర్పించు కార్టూన్




సుబ్బు వెళ్లిపోయాక, మార్వాడీ... రామం ఇచ్చిన ఫోటోను తన టేబుల్ సొరుగులో నుండి బయటకు తీసి, సుబ్బు ఇచ్చిన ఫోటో పక్కన పెట్టి చూసాడు.

రామం, సుబ్బు ఒకరికి తెలియకుండా ఒకరు ఇద్దరూ తయారు చేయమని ఇచ్చింది ఒకటే నగ తాలూకు ఫోటో! అదీ అర్జెంట్‌గా తయారు చేయమని ఇచ్చారు!... ఏదో జరుగుతోంది! ఏంటది!

తాను అమెరికాలో సంపాయించిన బ్లాక్ మనీని, దేశం దాటించకుండానే, అక్రమంగా భారతదేశంలో బ్లాక్‌మనీ రూపంలో తనవాళ్లకు ఇప్పించి, తనకు అలా మేలు చేసాడు సుబ్బు! తుమ్మినా, దగ్గినా, లేచినా, కూర్చున్నా... తనను అడుగడుగునా అవమానిస్తూ, తనను వేపుకు తిన్న, తన గయ్యాళి భార్య నుండి, సులభంగా విడాకులు ఇప్పించాడు లాయర్ రామం. ఇద్దరూ తనకు సహాయం చేసిన వారే!

అయితే ఒక్కటే తేడా! సుబ్బు...వెధవ పనులకు సహాయం చేస్తాడు. లాయర్ రామం, న్యాయం ఉంటేనే...మద్దతుగా నిలబడతాడు. అంటే, ఒకరేమో ఈ నగను ఏదో సత్కార్యానికి, ఇంకొకరు...వెధవ పనికి ఆడబోతున్నారు. అలాగని, లాయర్ రామానికి, ఈ విషయం చేరవేసి, ఒకప్పుడు తనకు సహాయం చేసిన సుబ్బును ఇరికించలేదు.

మార్వాడీ ఇంకా ఆలోచించాడు.


గిల్ట్ నగ చేయిస్తున్నారంటే... ఆ ఒరిజినల్


# కా.కా.క.క.

## (కాకతాళీయ కార్టూన్ల కథా కమామీషు)



**ఒకే** కార్టూన్ని పదిమంది కార్టూనిస్టులు కొద్ది మార్పులతో గీయడం జరుగుతుంది. చాలామంది అది 'కాపీ' కార్టూను కదా అనుకుంటారు. అలా అనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే ఒకే ఐడియా ఇద్దరు ముగ్గురు కార్టూనిస్టులకు రావడం సహజమే! అది 'కాకతాళీయం' మాత్రమే! **కాకతాళీయంగా గీసిన కార్టూన్లకు ఉదాహరణ ఈ శీర్షిక!** ఎవరు ముందు గీసారు? ఎవరు వెనుక గీసారు? అని కాకుండా ఇద్దరు కార్టూనిస్టులు ఒకే ఐడియాని ఎలా ప్రజెంట్ చేశారో తెలియ జేయడమే ఈ శీర్షిక ఉద్దేశం!




నగ లాయర్ తాలూకు మనుషుల దగ్గరో, సుబ్బు తాలూకు మనుషుల దగ్గరో ఉందన్న మాట!... ఈ గిల్ట్ నగతో ఆ ఒరిజినల్‌ను మార్చేసి, ఏదో మతలబు చేయబోతున్నారు! నేనేమైనా ఆ రహస్యం లాగగలనా!... నేను ఏమైనా లాభపడగలనా! ఆ సుబ్బుతో పెట్టు కుంటే... అమ్మో! వాడు దేవాంతకుడు. రౌడీ బుద్ధులు! పోనీ లాయర్ రామం! అమ్మో... లాయర్లతో వ్యవహారం బెడిసి కొడితే, నా వ్యాపారాన్ని మూయించినా మూయిస్తాడు!

సరే! ఎవరెలా చస్తే నాకేంటి!... నగలు చేయించి ఇస్తే చాలు!" మనసులో అను కున్నాడు మార్వాడీ.

ఆల్రెడీ రామం కోసం...గిల్ట్ నగ, ఆ షాప్ వెనకే ఉన్న...షెడ్డులో తయారు అవుతూనే ఉంది.

ఆ మార్వాడీ లోపలికి వెళ్ళి– "సేమ్ నగ ఇంకో సెట్ కావాలి!" అన్నాడు.

"ఇదేమైనా దోసేయ్, పెస్రేయ్... అని హోటల్‌లో సర్వర్ అరిచినట్లు చెబితే ఎలా సాబ్? ఇంకో నగ చేయాలంటే ఇక ఈ రాత్రి ఇంటికి వెళ్లకుండా పని చేయాల్సి ఉంటుంది!" అన్నాడు వారిలో సీనియర్!

"డబ్బు మూడు రెట్లు ఇస్తాను!"అన్నాడు మార్వాడీ!

అందరూ..."హేయ్..." అని అరుస్తూ, హుషారుగా పనిలో ముందుకు కదిలారు.

అయితే అక్కడే ఉన్న పని వారిలో ఒకతని దగ్గరకు, ఆ రోజు ఉదయమే మరో వ్యక్తి వచ్చి... సరిగ్గా అలాంటి నగ తయారు చేయ మని అడిగాడని...ఆ పనిని తన కొడుకుకు, అతడి టీంకు అప్పగించి మరీ ఇక్కడికి వచ్చా డని... ఎవ్వరికీ తెలియదు!

'ఒకేసారి ముగ్గురికి అదే నగ తాలూకు డూప్లికేట్ ఎందుకు అవసరం వచ్చిందో! అంటే... ఆ ఒరిజినల్ నగ ఆ ముగ్గురిలో ఎవరి దగ్గరో ఉంది. మోసం చేయడానికి, ఈ డూప్లికేట్‌ను, ఒరిజినల్‌తో మార్చబోతు న్నారన్న మాట! నేను లాభపడడానికి ఛాన్స్ ఏమైనా ఉందా!' అని మనసులో అనుకున్నాడు అతడు.

✦✦✦


ఇందు, చందు, రామం, రచన... సుబ్బు ఇంటికి కాస్త దూరంలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లోని, ఓ హోటల్ గదిలో కూర్చొని... బైనాక్యులర్స్‌తో సుబ్బు ఫ్లాట్‌ను గమనించ సాగారు. **(సశేషం)**



# పదానందం -8

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111





**ఆధారాలు:**

**అడ్డం:**

1. వాడుకభాషలో సంకోచపడటం (4)
4. ఒకరినొకరు కాళ్ళతో తన్నుకుంటూ చేసే యుద్ధం (4)
6. స్మశానపు కావలివాడు (5)
7. బాలకృష్ణునికి ఇష్టమైనది తిరగబడింది (2)
9. సర్వాధికారాలను గుప్పిట్లో పెట్టుకున్న నిరంకుశుడు (3)
11. దేవునికి కొట్టే కాయ చెల్లాచెదురై పోయింది... (3)
12. తిరగబడ్డ అతిథిసత్కారం (3)
14. భాగం (2)
15. యుద్ధభూమి, నాట్యస్థానం (2)
17. ఓర్వలేనితనం (2)
18. పళ్ళు ఇలా కొరుకుతారట (4)

**నిలువు**

1. తలమీద వేళ్ళకణుపులతో వేసేదెబ్బ (4)
2. నేర్పుగా మాట్లాడేవాడు (4)
3. రేపటికోసం దాచుకోవడం (2)
4. ఎరుక, ఒక వ్యక్తిని గురించి చెప్పడం (4)
5. ఒక తెలుగు పద్యరీతి కిందినుంచి (5)
8. దీనిలో భోజనం చేస్తే ఆరోగ్యం (4)
9. దిటవు (3)
10. సత్యం, కచ్చితంగా జరిగేది (2)
13. పైకొచ్చిన స్త్రీ (3)
16. తట్ట (2)

సమాధానం వచ్చే సంచికలో...

## గత సంచిక సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 వె | ట | 2 కా | రం | | 3 డీ | 4 లా | |
| ర్రి | | య | | 5 రే | | 6 భం | 7 గం |
| | 8 రో | క | టి | పో | టు | | ద |
| 9 క | | ష్టం | | మా | | 10 దొ | ర |
| 11 డ్డీ | 12 వ | | 13 అ | పో | 14 హ | | గో |
| | 15 స | హో | రా | | 16 వి | రా | ళం |
| | పి | | 17 చ | ప్పి | డి | | |
| 18 చు | ట్ట | రి | కం | | 19 డా | కి | ని |

ఇంటిల్లిపాదినీ నవ్వించే పని పెట్టుకున్న
ఏకైక తెలుగు హాస్య మాస పత్రిక





మనోవికాసానికి మందు
ఆనందం!...
హాస్యానందంతో
పొందుదాం!


చందాదారులుగా
చేరండి.

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P


# మీ ఆనందం కోసం మరో 3 పుస్తకాలు




బాపుగారి ఎప్పుడూ ఇంతే!
కార్టూన్ సంకలనం
వెల: రూ.500/- పోస్టల్ చార్జీలతో కలిపి
వివరాలకు- paperpapayi@gmail.com
సంప్రదించండి!





వెల: రూ.150/-
10 పుస్తకాలు కొన్న వారికి రూ.100/-(1000) మాత్రమే!
వివరాలకు- 9989596554



వెల: రూ.140/-
వివరాలకు- 9393662821

Hasyanandam March-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC



చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548